భారత

కమ్యూనిస్టు పార్టీ

(మార్క్సిస్టు)

కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి, అస్సాం

# అసెంబ్లీ ఎన్నికల సమీక్ష

(ఆగస్టు 6–8, 2021 ఢిల్లీలో జరిగిన సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సమావేశంలో ఆమోదించినది)

ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ

# కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి, అస్సాం
# అసెంబ్లీ ఎన్నికల సమీక్ష

(ఆగస్టు 6–8, 2021 ఢిల్లీలో జరిగిన సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సమావేశంలో ఆమోదించినది)

## స్థూలంగా ఫలితాలు

**బిజెపికి ఎదురుదెబ్బ:** ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లలో బిజెపికి ఎదురు దెబ్బ తగిలింది. అస్సాంలో నామమాత్రపు మెజారిటీతో బయటపడింది. ఆ పార్టీకి ప్రతిపక్ష మహా కూటమి కన్నా కేవలం 0.78 శాతం మాత్రమే అధికంగా ఓట్లు లభించాయి. మతపరమైన విభజనను మరింత తీవ్రం చేయడానికి ఎంతో ప్రయత్నించినప్పటికీ, ఇంతకు ముందెన్నడూ లేనంతగా పెద్ద ఎత్తున డబ్బు వెదజల్లినప్పటికీ, కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలను దుర్వినియోగం చేసినప్పటికీ, ఎన్నికల యంత్రాంగాన్ని తొత్తడం చేసినప్పటికీ, ప్రతిపక్షాలను, నాయకులను భయపెట్టి, బెదిరించినప్పటికీ బిజెపి, దాని మిత్ర పక్షాలు ప్రజామద్దతును కూడగట్టుకోలేకపోయాయి. కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లలో ఆ పార్టీని ప్రజలు మట్టికరిపించారు.

రాజ్యాంగం నిర్దేశించిన భారత రిపబ్లిక్ లౌకిక, ప్రజాస్వామిక స్వభావం బిజెపి పాలనలో తీవ్రమైన దాడికి గురవుతున్నది. అలాంటి సెక్యులర్, ప్రజాస్వామిక భారత రిపబ్లిక్‌ను కాపాడుకోవడానికి ప్రజాఉద్యమాలను, పోరాటాలను మరింత బలోపేతం చేయడానికి  ఈ ఎన్నికల ఫలితాలు అవకాశాలు కల్పిస్తాయి. కోవిడ్

మహమ్మారి మూలంగా దుర్భర పరిస్థితుల నెదుర్కొంటున్న ప్రజలు జీవన్మరణ సమస్యలను ఎదుర్కొనేందుకు, తమ బ్రతుకులు బాగుచేసుకునేందుకు ప్రజా ఉద్యమాలను, పోరాటాలను పెద్ద ఎత్తున బలోపేతం చేయడానికి ఈ ఫలితాలు అవకాశాలు కల్పిస్తాయి.

## కేరళ

సిపిఐ(ఎం) నాయకత్వంలోని ఎల్‌డిఎఫ్ ఈ ఎన్నికల్లో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. కేరళలో గత నాలుగు దశాబ్దాల కాలంలో పాలక పార్టీయే మళ్లీ ఎన్నికల్లో విజయం సాధించడం ఇదే మొదటి సారి. గత అసెంబ్లీ ఎన్నికల్లో కన్నా ఎల్‌డిఎఫ్ ఈ సారి మరింత మెరుగైన ఫలితాలు సాధించింది. గత ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ పనితీరుపై ప్రజలిచ్చిన తీర్పు ఇది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వినాశకర విధానాలకు భిన్నంగా అనుసరిస్తున్న ప్రత్యామ్నాయ విధానాలు, తీవ్రమైన ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొన్న తీరు, అత్యంత ప్రశంసనీయమైన రీతిలో కోవిడ్ మహమ్మారిని ఎదుర్కొనడానికి జరిపిన కృషి, కోవిడ్ బారిన పడ్డ వారిని ఆదుకొన్న తీరు, గత ఐదేళ్లుగా అనుసరిస్తూ వచ్చిన సంక్షేమ చర్యలు– ఈ విజయానికి కారణం.

ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పైనా, ముఖ్యమంత్రిపైనా తీవ్రమైన తప్పుడు అవినీతి ఆరోపణలను చేసే యుడిఎఫ్, బిజెపిల విచ్ఛిన్నకర విధానాలను సమర్థవంతంగా తిప్పికొడుతూ, ఎల్‌డిఎఫ్ ఈ ప్రజా తీర్పును స్వంతం చేసుకున్నది. కేరళ సమాజపు లౌకిక, మత సామరస్య స్వభావాన్ని రక్షించే సత్తా ఎల్‌డిఎఫ్‌కే ఉందని ప్రజలు గుర్తించారు. బిజెపి, ఆరెస్సెస్‌లు చేపట్టినపౌరసత్వ బిల్లు, ఇంకా ఇతర హిందూత్వ విధానాలకు వ్యతిరేకంగా ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం తీసుకున్న పటిష్ట వైఖరి మైనారిటీల మద్దతును, విశాల ప్రజానీకపు మద్దతును పెంచకలిగింది.

బంగారపు స్మగ్లింగు కేసులో తప్పుడు ఆరోపణలు చేస్తూ ముఖ్యమంత్రిని, మొత్తం ప్రభుత్వాన్ని తీవ్రంగా అప్రతిష్ఠ పాల్జేయడానికి ఇంతకు ముందెన్నడూ లేని విధంగా ఇడి లాంటి కేంద్ర ఏజెన్సీలను వినియోగించడం ఈ ఎన్నికల సమయంలో కనిపించింది. మితవాద మీడియా ఎల్‌డిఎఫ్ పై పెద్ద ఎత్తున దుష్ప్రచారానికి పాల్పడింది. బిజెపి, యుడిఎఫ్‌ల మద్దతుతో సాగిన ఈ చర్యలను ఎల్‌డిఎఫ్ బలంగా తిప్పికొట్టింది. ఈ కక్షపూరిత చర్యల భాగోతాన్ని ప్రజలు ఏవగించుకున్నారు.

2016 ఎన్నికల్లో 91 స్థానాలు గెలుచుకున్న ఎల్‌డిఎఫ్ ఈ సారి 99 స్థానాలతో మూడింట రెండువంతుల మెజారిటీ సాధించింది. సిపిఐ(ఎం), దాని

స్వతంత్ర అభ్యర్థులు 67 మంది గెలుపొందారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల చరిత్రలో ఒకే పార్టీ ఇన్ని స్థానాలు సాధించడం ఇదే మొదటి సారి. కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కార్మికులు, యువత, విద్యార్థులు, వెనుకబడిడిన తరగతులు, దళితులు, మైనారిటీలు మధ్యతరగతి, మహిళలు– ఇలా అన్ని సెక్షన్ల ప్రజానీకం ఎల్‌డిఎఫ్ కు మద్దతు తెలియచేశారు. ప్రభుత్వం పనితీరును ప్రజల వద్దకు చేరవేయడంలో పార్టీ యంత్రాంగపు సామర్థ్యం పార్టీకి వెలుపల ఉన్న ప్రజానీకాన్ని ఆకట్టుకునేలా చేసింది. గత పార్లమెంటరీ ఎన్నికల్లో వినియోగించుకున్నట్లుగానే శబరిమలలోకి మహిళలను అనుమతించడం లాంటి భావోద్వేగ అంశాలను ఇప్పుడూ యుడిఎఫ్ వినియోగించుకోవడానికి ప్రయత్నించినప్పటికీ ప్రజలు పట్టించుకోలేదు.

**ఎల్‌డిఎఫ్ సీట్ల సర్దుబాటు:** కేరళ కాంగ్రెస్ (ఎం), ఇంకా ఇతరులతో ఎల్‌డిఎఫ్ విస్తరించిన తర్వాత జరిగిన ఎన్నికలు ఇవి. అందుచేత ఇప్పటి వరకు ఎల్‌డిఎఫ్ భాగస్వాములు పోటీ చేసిన కొన్ని స్థానాలను కొత్త భాగస్వామలతో పంచుకోవలసి వచ్చింది. ఎల్‌డిఎఫ్ భాగస్వాములు అందరూ సహకరించడంతో సీట్ల సర్దుబాటు సంతృప్తికరంగా జరిగింది. సీట్ల పంపిణీలో అసంతృప్తి లేకపోవడం ఎల్‌డిఎఫ్ ఎన్నికల్లో మరింత బలంగా పాల్గనేలా చేసింది.

ఎల్‌డిఎఫ్ గెలుపొందిన 99 స్థానాల్లో సిపిఐ(ఎం) కు 67 (61+6 ఇండిపెండెంట్లు), సిపిఐ కి 15, కేరళ కాంగ్రెస్ (ఎం) కు 5, జెడి (ఎస్) కు 2, ఎన్‌సిపి కి 2, డెమొక్రాటిక్ కేరళ కాంగ్రెస్ కు 1, ఎల్‌జెడికి 1, ఐఎన్‌ఎల్ కు 1, కాంగ్రెస్ (ఎస్) కు 1, ఆరెస్పి (లెనినిస్టు) కు 1 లభించాయి.

**పార్టీ అభ్యర్థుల ఎంపిక:** ఒకే స్థానంలో రెండు సార్లు పోటీచేసిన అభ్యర్థులు మళ్లీ తిరిగి పోటీ చేయాల్సిన అవసరం లేదని పార్టీ రాష్ట్ర కమిటీ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. చట్ట సభల్లోను, మంత్రులుగాను సుదీర్ఘ అనుభవం కలిగిన కామ్రేడ్స్‌ను పార్టీ వ్యవస్థాగత నిర్మాణంలోను, ఇతరత్రాను వినియోగించుకోవాలన్నది ఈ నిర్ణయం వెనుక ఉన్న ఉద్దేశం. దీని ప్రకారం 33 మంది సిట్టింగ్ ఎంఎల్‌ఏలు తిరిగి పోటీచేయవలసిన అవసరం లేదని నిర్ణయం తీసుకోబడింది. ఈ స్థానాల్లో అభ్యర్థులుగా కొత్తవారిని పార్టీ ఎంపిక చేసింది. ఈ వైఖరిని ప్రజలు, పార్టీ శ్రేణులు అర్థం చేసుకున్నారు.

ఈ సందర్భంగా 1998 దిద్దుబాటు ఉద్యమ డాక్యుమెంటులో ఎన్నికయిన ప్రజాప్రతినిధులకు రెండు, లేదా మూడు దఫాలుగా నిర్ణయించాలని పార్టీ కేంద్రకమిటీ సిఫార్సు చేసిన విషయాన్ని మనం గుర్తుచేసుకోవాలి. ఆ నిర్ణయాన్ని సంపూర్ణంగా అమలు చేసిన కేరళ మంచి ఫలితాలు సాధించింది.

**ఫలితాలు:** 2016లో ఎల్‌డిఎఫ్‌కు 87,25,939 ఓట్లు (43.35 శాతం) లభించగా, 2021లో 94,07,662 ఓట్లు (45.28 శాతం) లభించాయి. యుడిఎఫ్ కు 2016లో 78,08,743 ఓట్లు (38.79 శాతం) లభించగా, 2021లో 81,85,240 ఓట్లు (39.49 శాతం) లభించాయి. బిజెపి కి 2016లో 30,20,886 ఓట్లు (15.01 శాతం) లభించగా, 2021లో 25,92,139 ఓట్లకు (12.47 శాతం) తగ్గిపోయాయి. బిజెపి కోల్పోయిన ఓట్లలో కొంత భాగం బదిలీ కావడంతో యుడిఎఫ్ ఓట్ల శాతం స్వల్పంగా పెరిగింది. 2016 ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ కు యుడిఎఫ్ కు వచ్చిన ఓట్ల కన్నా 4.5 శాతం 9,17,194 ఓట్లు అధికంగా రాగా, 2021లో 6.14 శాతం (12,12,182 ఓట్లు అధికంగా వచ్చాయి.

| | 2016 | 2021 |
|---|---|---|
| ఎల్‌డిఎఫ్ | 43.35 | 45.28 |
| యుడిఎఫ్ | 38.79 | 39.49 |
| బిజెపి | 15.01 | 12.47 |

11 జిల్లాలలో ఎల్‌డిఎఫ్‌కు యుడిఎఫ్ కన్నా అధిక స్థానాలు లభించాయి. 12 జిల్లాలలో ఎల్‌డిఎఫ్ ఓట్ల శాతం పెరిగింది. 5 జిల్లాలలో యుడిఎఫ్ కు తక్కువ ఓట్లు లభించాయి. కొల్లం, ఎర్నాకులం జిల్లాలో ఎల్‌డిఎఫ్ కు ఓట్లు తగ్గాయి.

ఎర్నాకులం జిల్లాలో యుడిఎఫ్ అధికంగా 14 స్థానాలకు కాను, 9 స్థానాలు, మల్లాపురం జిల్లాలో 16 స్థానాలకు కాను 12 స్థానాలు, వైనాడ్ జిల్లాలో 3 స్థానాలకు కాను 2 స్థానాలు గెలుపొందింది. బిజెపి తన ఏకైక స్థానం మెమొం ను కోల్పోయింది. ఆ స్థానాన్ని ఎల్‌డిఎఫ్ కైవసం చేసుకుంది.

ఈ సారి ఎల్‌డిఎఫ్ భాగస్వాములందరికీ అసెంబ్లీలో ప్రాతినిధ్యం లభించింది. అసెంబ్లీకి ఎన్నికయిన 10 మంది మహిళల్లో 9 మంది ఎల్‌డిఎఫ్ కు చెందిన వారే. షెడ్యూలు కులాలకు కేటాయించిన 14 స్థానాల్లో 13 స్థానాలను ఎల్‌డిఎఫ్ గెలుచుకుంది. వారిలో 9 మంది సిపిఐ(ఎం) కు చెందినవారు. షెడ్యూల్డు ట్రైబ్స్‌కు కేటాయించిన 2 స్థానాల్లో 1 స్థానాన్ని ఎల్‌డిఎఫ్ గెలుచుకుంది. అయితే, ఎల్‌డిఎఫ్ నిలిపిన మహిళా అభ్యర్థుల సంఖ్య ఇంకా తక్కువగానే ఉంది.

బిజెపి కున్న ఒకే ఒక్క స్థానాన్ని ఎల్‌డిఎఫ్ గెలుచుకుంది. 2016 నుండి బిజెపి ఓటింగ్ 15 శాతం కన్నా కొంచెం ఎక్కువా ఉంటున్నది. ఈ సారి అది12.7

శాతానికి పడిపోయింది. బిజెపి ఓట్ల శాతం 2006 నుండి క్రమంగా పెరుగుతూ వస్తున్నది. ప్రస్తుత జాతీయ పరిస్థితిలో రాష్ట్రంలో బిజెపి ఓట్ల శాతం పడిపోవడం ప్రాధాన్యత కలిగిన అంశం. ఈ ఎన్నికల్లో బిజెపి పెద్ద ఎత్తున డబ్బు వెదజల్లడంతో పాటు, కేంద్ర ప్రభుత్వాన్ని యధేచ్ఛగా వినియోగించుకున్నది.

పునాది వర్గాలలో అత్యధికులు ఎల్‌డిఎఫ్ కు ఓటు చేశారు. సంప్రదాయ పరిశ్రమల్లోని కార్మికులకు ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అందించిన సహాయం, ఆహార కిట్ల పంపిణీ లాంటి ఇతర ఉపశమన చర్యలు ఉపయోగపడ్డాయి. రైతులు, వ్యవసాయ కార్మికులు ఎల్‌డిఎఫ్ కు మద్దతు నందించారు. అసంఘటితం రంగంలోని కార్మికులంతా స్థూలంగా ఎల్‌డిఎఫ్ కే ఓటు చేశారు. సంఘటితరంగ కార్మికుల్లో ఎల్‌డిఎఫ్ పట్ల ప్రతికూల ధోరణి వ్యక్తం కాలేదు. మధ్యతరగతి వర్గం లోని పెద్ద సెక్షన్లు మనకు మద్దతు అందించాయి. ఈ అంశాలన్నీ ఎల్‌డిఎఫ్ ఘనవిజయానికి దోహదపడ్డాయి.

**ఎల్‌డిఎఫ్ విజయానికి ప్రధాన కారణాలు:** 1, బిజెపి–ఆరెస్సెస్ ప్రమాదానికి వ్యతిరేకంగా పార్టీ తీసుకున్న స్పష్టమైన వైఖరి. కాంగ్రెస్ నాయకత్వంలోని యుడిఎఫ్, బిజెపి ల మధ్య అవకాశవాద పొత్తును ఎండగట్టడం.

2, కేరళ కాంగ్రెస్ (ఎం), ఎల్‌జెడి ల చేరికతో ఎల్‌డిఎఫ్ విస్తరించడం.

3, ప్రజల జీవితాలకు సంబంధించిన అంశాలలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అద్భుతమైన కృషితో గుణాత్మకమైన మార్పును సాధించడం.

4, సాంఘిక సంక్షేమ చర్యల సక్రమ అమలు.

5, మత సామరస్యం ప్రాతిపదికగా ప్రజానీకం లోని అన్ని సెక్షన్లకు రక్షణ కలుగ చేయడం. పాలక ప్రభుత్వం పట్ల సహజంగా ఉండే వ్యతిరేకత ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పట్ల లేకపోవడం. అభివృద్ధి కోసం ప్రజలు ఎల్‌డిఎఫ్ కు ఓటు చేయడం.

**కొన్ని ఆందోళన కల్గించే అంశాలు:** ఈ సానుకూల అంశాలను గమనిస్తూనే, 2006 లో మన ఓటింగ్ శాతం కన్నా ఇప్పుడు ఓటింగ్ శాతం తక్కువగా ఉందన్న అంశాన్ని గుర్తించాలి. దీనికి కారణాలు ఏమిటన్నదాన్ని తీవ్రంగా పరిశీలించి, మన ప్రభావాన్ని పెంచుకునేందుకు చర్యలు గైకొనాలి. ప్రజల ఆంగీకారాన్ని పెంచుకోవడానికి మనం చేస్తున్న కృషికి అడ్డుపడుతున్న అంశాలను గుర్తించి, వాటి పరిష్కారానికి పూనుకోవాలి. యుడిఎఫ్, బిజెపి ల వెనుక ఉన్న సాధారణ ప్రజానీకాన్ని మనవైపుకు సమీకరించేందుకు ప్రయత్నించి ప్రజాపునాదిని పెంచుకోవాలి. మనం వెనుకబడి ఉన్న నిర్దిష్ట రంగాలలో కృషిని సరిదిద్దుకునే ప్రయత్నం జరగాలి.

బిజెపి 9 స్థానాల్లో రెండవ అతి పెద్ద పార్టీగా వచ్చిన విషయాన్ని మనం గుర్తించాలి. కాసర్‌గోడ్ జిల్లాలోని భాషాపరంగా మైనారిటీ నియోజకవర్గాల్లో కొంత కాలంగా బిజెపి రెండవ స్థానంలో ఉంటూ వస్తున్నది. ఈ సారి కూడ బిజెపి ఓట్లు చాల స్థానాలలో యుడిఎఫ్ కు బదిలీ అయ్యాయి. బిజెపి రెండవ స్థానంలో వచ్చిన స్థానాలపై మనం మరింత శ్రద్ధ కనపరచాలి.

2011 తో పోల్చుకున్నపుడు ఎల్‌డిఎఫ్ ఓటింగ్ శాతం 12 జిల్లాల్లో పెరిగినప్పటికీ, కొల్లం, ఎర్నాకులం జిల్లాల్లో పడిపోయిన విషయాన్ని రాష్ట్ర కమిటీ గుర్తించింది. ఈ అంశాన్ని. ప్రత్యేకించి వామపక్ష, కార్మికవర్గ ఉద్యమానికి పునాదిగా ఉన్న కొల్లం జిల్లాను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలి.

**పార్లమెంటరీ పెడధోరణిని సరిదిద్దాలి:** పార్లమెంటరీ, చట్టసభల కార్యకలాపాల్లో నిరంతరం పాల్గనే పార్టీగా మనం పార్లమెంటరీ పెడధోరణల పట్ల అప్రమత్తంగా ఉందాలి. పార్లమెంటరీ భ్రమలకు కామ్రేడ్స్ లోనుకావడం పట్ల, పార్లమెంటరీ పదవుల కోసం ఆరాటపడటం పట్ల జాగ్రత్త వహించాలి. కేరళ రాష్ట్ర కమిటీ, కేంద్ర కమిటీల దిద్దుబాటు డాక్యుమెంట్లు వివిధ సందర్భాలలో ఈ పెడధోరణుల ఉనికిని గుర్తించాయి.

ఈ ఎన్నికల సందర్భంలో కూడ కొన్ని పొరపాటు ధోరణులు వ్యక్తమయ్యాయి. రెండు నియోజక వర్గాలలో పార్టీ సభ్యులు బహిరంగ నిరసన ప్రదర్శనలు చేశారు. ఇది పార్టీలో హానికరమైన ధోరణి. కొన్ని స్థానాలలో ముఠాతత్వం ఎన్నికల ప్రచారంపై ప్రభావం చూపింది. అలాంటి ధోరణులను గట్టిగా నిరోధించాలి, చక్కదిద్దే చర్యలను చేపట్టాలి. ఈ ధోరణులను అరికట్టడానికి పార్టీ దిద్దుబాటు ఉద్యమాన్ని చేపట్టాలి.

**నిర్మాణపరమైన చర్యలు:** రాష్ట్ర ఎన్నికల సమీక్ష పార్టీని పటిష్టం చేయడానికి కొన్ని నిర్మాణపరమైన చర్యలను పేర్కొంది. వాటిని గమనంలోకి తీసుకొని క్రింది చర్యలను చేపట్టాలి.

1, పార్టీ సభ్యత్వం పెద్ద ఎత్తున పెరిగిన నేపథ్యంలో పార్టీ సభ్యుల నాణ్యతను మెరుగుపరిచేందుకు వారి రాజకీయ, నిర్మాణపరమైన స్థాయిని పెంపొందించాలి.

2, ఎన్నికల క్రమంలో ప్రజానీకం పెద్ద సెక్షన్లు పార్టీ పట్ల ఆకర్షితులయ్యారు. వారిని పార్టీకి దగ్గర చేయడానికి చర్యలు తీసుకోవాలి.

3, ముస్లిం ప్రాంతాలలో మధ్యతరగతితో సహా కొత్త సెక్షన్లు పార్టీకి చేరువ అయ్యాయి. వారిలో ఉత్తమమైన వారిని పార్టీలోకి రిక్రూట్ చేసుకొని, ఆ ప్రాంతంలో పార్టీని నిర్మించడానికి చర్యలు చేపట్టాలి. క్రైస్తవ మతస్తులలో కూడ మరింత మంది

పార్టీ సభ్యులను రిక్రూట్ చేసుకోవడం పట్ల శ్రద్ధ పెట్టాలి.

4, పార్టీ సభ్యుల్లోను, శాఖల్లోను హిందూత్వ శక్తుల సైద్ధాంతిక, రాజకీయ కుట్రల పట్ల చైతన్యాన్ని పెంపొందించాలి.

**ఎన్నికల తర్వాత యుడిఎఫ్:** ఎన్నికల్లో మనం పురోగతి సాధించినప్పటికీ కాంగ్రెస్ నాయకత్వంలోని యుడిఎఫ్ బలాన్ని గుర్తించాలి. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో కన్నా యుడిఎఫ్ ఓటింగ్ శాతం స్వల్పంగా పెరిగింది. అప్పుడు 38.8 శాతం ఉంటే, ఇప్పుడు 39.4 కు పెరిగింది. ముస్లిం మతస్తులలో పెద్ద ఎత్తున ప్రభావం కలిగిన ముస్లిం లీగ్ యుడిఎఫ్ కు గట్టి మద్దతు దారుగా ఉంది. కేరళలోని కమ్యూనిస్టు వ్యతిరేక మీడియా కూడ యుడిఎఫ్ కు గట్టి మద్దతు అందిస్తున్నది. ఉన్నత మధ్యతరగతి వర్గంలో కూడ యుడిఎఫ్ గణనీయమైన పలుకుబడి కలిగి ఉంది.

యుడిఎఫ్ ముస్లిం చాందసవాదులతో ఒక వైపున అవగాహన కలిగి ఉంటూనే, ఓట్ల బదలాయింపు కోసం బిజెపితో వ్యవహరిస్తున్నది. వారి ప్రయత్నాలను కొత్త రూపంలో కొనసాగిస్తారు. యుడిఎఫ్ వెనుక ఉన్న జనబాహుళ్యాన్ని పార్టీ వైపుకు ఆకర్షించడానికి ప్రయత్నం చేస్తూ, పునాది వర్గాలలో మన స్థానాన్ని విస్తరించుకుంటూ యుడిఎఫ్ ను బలహీనం చేసేందుకు కృషి చేయాలి.

**బిజెపి పరిస్థితి:** బిజెపి గత కొద్ది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారాన్ని వినియోగించుకొని మతపరమైన విభజనను తీవ్రతరం చేయడం ద్వారా తన బలాన్ని పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నది. పెద్ద ఎత్తున డబ్బు ఖర్చుపెట్టడానికి కేంద్రంలో అధికారం వారికి ఉపయోగపడుతున్నది. హిందూ మతస్తులలోని కొన్ని సామాజిక శక్తులు బిజెపి వైపుకు మరలుతున్నాయి. అయినప్పటికీ గత ఎన్నికలతో పోల్చుకున్నపుడు ఈ ఎన్నికల్లో బిజెపి ఓటింగ్ శాతం బాగా పడిపోయింది. అసెంబ్లీలో వారు ప్రాతినిధ్యం కోల్పోయారు. బిజెపి ఓట్ల శాతం పడిపోయింది కాబట్టి అది బాగా బలహీనపడిపోయిందన్న నిర్ధారణకు రాకూడదు.

బిజెపి మద్దతు ఇస్తున్న పేద ప్రజానీకం దానికి దూరం అవుతున్నారు. అలాంటి సెక్షన్లు యుడిఎఫ్ వైపుకు ఆకర్షితులు కాకుండా మనం జాగ్రత్త వహించాలి. మన ప్రభావం ఉన్న సెక్షన్లలోకి బిజెపి ప్రవేశించడానికి చేసే ప్రయత్నాలను నిరోధించాలి. బిజెపి కొత్తగా ఏ రంగాలకు విస్తరిస్తున్నదీ పరిశీలించి దాన్ని నివారించేందుకు చర్యలు చేపట్టాలి.

**పార్టీపై నూతన బాధ్యతలు:** దేశంలోని పురోగామి శక్తులు ఎల్‌డిఎఫ్ పట్ల గణనీయమైన ఆశలు పెంచుకున్నాయి. ప్రస్తుత జాతీయ పరిస్థితిలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం

పనితీరు, బిజెపికి, దాని హిందూత్వ, మతతత్వ వైఖరులకు, ప్రపంచీకరణ విధానాలకు ప్రత్యామ్నాయంగా చేపట్టే విధానాలు ప్రజాపోరాటాలు పెరగటానికి కావలసిన వూతమిస్తాయి.

ఎల్‌డిఎఫ్ ఓటింగ్ శాతం గత ఎన్నికల్లో కన్నా పెరిగింది. కాని కెసి(ఎం), ఎల్‌జెడి లు చేరిన తర్వాత కూడ, ప్రభుత్వం మెరుగైన తీరులో పనిచేసిన తర్వాత కూడ మన ఓటింగ్ శాతం కేవలం 1.93 శాతం మాత్రమే పెరిగిన విషయాన్ని తీవ్రంగా పరిశీలించుకోవాలి. 2006 ఎన్నికల్లో సాధించిన ఓటింగ్ 48.81 శాతాన్ని 2016 ఎన్నికల్లో కాని, 2021 ఎన్నికల్లో కాని మనం చేరుకోలేకపోయాము.

వరుసగా రెండవ సారి అధికారంలోకి రావడం నూతన అనుభవం. ఇది మరిన్ని బాధ్యతలను మనపై మోపింది. ప్రభుత్వ పరంగా ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల్లో ఆర్థికాభివృద్ధి స్థాయిని కొనసాగించాలి, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో ఉత్పత్తిని పెంపొందించాలి. కేరళ సమాజంలో మితవాదం వైపుకు మొగ్గు కనిపిస్తున్నది. వరకట్న మరణాలు, మహిళలపై హింస, కాలం చెల్లిన, అభివృద్ధి నిరోధక సామాజిక ఆచారాలు మొదలైన వాటిలో ఇది వ్యక్తమవుతున్నది. పార్టీ, పురోగామి శక్తులు ఈ ధోరణులను ఎదుర్కొనాలి. అంతిమంగా, పార్టీ సభ్యుల రాజకీయ, సైద్ధాంతిక స్థాయిని పెంపొందించాలి. అది మాత్రమే నూతన పరిస్థితిలో మనపై మోపబడిన బాధ్యతలను నెరవేర్చేలా చేయగలదు.

అనేక మంది పార్టీ శ్రేణులు, క్యాబినెట్‌లోను, ఎంఎల్‌ఏలుగాను, స్థానిక సంస్థల ప్రతినిధులుగాను, సహకార రంగంలోను బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మన వైఖరి, ప్రవర్తన ప్రజల్లో మనపట్ల విశ్వాసాన్ని పెంపొందించేదిగా ఉండాలి. అధికార దర్పం, అహంకారం, అవినీతి చర్యలకు మనం దూరంగా ఉండాలి. పార్టీ, వర్గ, ప్రజా సంఘాలు ప్రభుత్వానికి తోకలుగా ఉండకుండా, ప్రభుత్వ పాలనపై ఆధారపడకుండా స్వతంత్రంగా పనిచేయాలి. పార్టీ శ్రేణులు నమ్రతతో ప్రజల పట్ల బాధ్యతతో మెలగాలి.

దేశంలోని వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు మరింత ముందుకు సాగేందుకు వినియోగపడేలా కేరళలోని సిపిఐ(ఎం), ఎల్‌డిఎఫ్‌లు నూతన మార్గాన్ని ఆవిష్కరించాలి.

## పశ్చిమ బెంగాల్

పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు పార్టీకి వినాశకరమైన ఫలితాలనిచ్చాయి. 1946 తర్వాత పార్టీ ఇంతటి దారుణమైన ఫలితాలను ఎన్నడూ చవిచూడలేదు. స్వతంత్ర భారత దేశంలో మొదటి సారి పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో

ఒక్క కమ్యూనిస్టు కూడ ఎన్నిక కాని పరిస్థితి ఎదురైంది.

రాష్ట్ర నాయకత్వం ఈ పరిస్థితికి బాధ్యతను స్వీకరించింది. ఈ ఎన్నికల సమీక్ష ఒక్క సారి జరిపి వూరుకునేది కాదు. తీవ్రమైన ఆత్మ విమర్శనతో కొనసాగించవలసిన అంతర్మథనం.

ఈ పరిస్థితికి అనేక అంశాలు కారణం. రాజకీయంగాను, నిర్మాణపరంగాను పార్టీ గతంలో తీసుకున్న నిర్ణయాలను సక్రమంగా అమలు చేయలేకపోవడం దీనికి దారితీసింది. దీనికి కారణాలను నిశితంగా గుర్తించి వాటిని సరిదిద్దాల్సి ఉంది.

పశ్చిమ బెంగాల్ ప్రజలు బిజెపిని ఓడించడం గొప్ప విషయం. 294 అసెంబ్లీ స్థానాలకు 8 దశలుగా నెలరోజులకు పైగా ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. ఓటర్లలో 81.77 శాతం మంది, దాదాపు 6 కోట్ల మంది పోలింగ్‌లో పాల్గన్నారు. తృణమూల్ కాంగ్రెస్‌కు 213 స్థానాలు, బిజెపికి 77 స్థానాలు లభించాయి.

లెఫ్ట్ ఫ్రంట్‌తో పాటు పార్టీ, కాంగ్రెస్‌తోను, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ (ఐఎస్ఎఫ్) తోను పొత్తు పెట్టుకున్నది. సంయుక్త మోర్చా గా పేర్కొనబడ్డ ఈ పొత్తు ఒక్క సీటునూ గెలుచుకోలేదు.

బిజెపి ఉన్నత స్థాయిలో దూకుడుగా ప్రచారాన్ని సాగించినప్పటికీ, పెద్ద ఎత్తున డబ్బు కుమ్మరించినప్పటికీ, ప్రధాన మంత్రి, హోం మంత్రి లాంటి వారు రాష్ట్రవ్యాపితంగా ఎన్నికల ప్రచార సభల్లో పాల్గన్నప్పటికీ ఓటమి పాలయింది. ఇలాంటి దూకుడు ప్రచారం తమ సాంస్కృతిక జీవన విధానంపై దాడి అని, హిందుత్వ విధానాలను బెంగాల్‌పై రుద్దే ప్రయత్నమని బెంగాల్ ప్రజలు భావించారు. బిజెపిని ఓడించడానికి ప్రధాన సాధనం తృణమూల్ అని ప్రజలు విశ్వసించారు. బిజెపికి వ్యతిరేకంగాను, తృణమూల్ పదేళ్ళ భయానక పాలనకు వ్యతిరేకంగాను ప్రచారం చేసినప్పటికీ, సంయుక్త మోర్చాను ఒక ప్రత్యామ్నాయంగా ప్రజలు పరిగణించలేదు.

17వ బెంగాల్ అసెంబ్లీ బలాబలాలు తృణమూల్, బిజెపిల మధ్య విభజించబడిఉన్నాయి. బిజెపి ప్రధాన ప్రతిపక్షంగా అవతరించడం భవిష్యత్తుకు ప్రమాద సూచిక. ఈ ఫలితాలు, బిజెపి పెద్దఎత్తున ప్రయోజనం పొందిన 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఏర్పడిన రెండు ధృవాల రాజకీయ వాతావరణాన్ని సహజంగానే మరింత బలోపేతం చేశాయి. ఈ ఎన్నికల ప్రచారం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పోటీగా సాగింది. ప్రధాన మంత్రికి, ముఖ్య మంత్రికి మధ్య అంటే బిజెపికి, తృణమూల్ కు మధ్య పోటీగా మారింది. 2019 లోక్ సభ ఎన్నికల్లో సిపిఐ(ఎం) కు ఏ అసెంబ్లీ నియోజకవర్గ సెగ్మెంట్‌లోను మెజారిటీ ఓట్లు లభించలేదు. బిజెపి,

తృణమూల్ ల మధ్య తీవ్రమైన విభజన మరే రాజకీయ శక్తికి స్థానం లేకుండా చేసినట్లు స్పష్టమయింది.

పార్టీ రాష్ట్ర కమిటీ ఈ అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న దశలోనే 2019లో ఏర్పడిన ద్విముఖ రాజకీయ విభజనలో మార్పేమీ లేదన్న అంచనాకొచ్చింది. ఎన్నికల ఫలితాలు ఆ అంచనాను ధృవపరిచాయి. కాని ప్రశ్నేమిటంటే, 2019–2021 మధ్య కాలంలో మనం ఈ విభజనను ఎందుకు మార్చలేకపోయామన్నదే.

సిపిఐ(ఎం) 138 స్థానాలలో మన గుర్తుపై పోటీ చేసింది. మనకు కేవలం 4.73 శాతం ఓట్లు మాత్రమే లభించాయి. సంయుక్త మోర్చాకు మొత్తం మీద 9.9 శాతం ఓట్లు లభించాయి. వీటిలో లెఫ్ట్ ఫ్రంట్‌కు 5.6 శాతం, కాంగ్రెస్‌కు 2.3 శాతం, ఐఎస్ఎఫ్ కు 1.38 శాతం ఓట్లు లభించాయి.

2016 ఎన్నికల్లో లెఫ్ట్ ఫ్రంట్ 32 స్థానాలు గెలుచుకుంది. ఇప్పుడు వీటిలో 23 స్థానాల్లో తృణమూల్, 9 స్థానాలలో బిజెపి గెలుపొందాయి. 2016లో కాంగ్రెస్ 44 స్థానాలు గెలుచుకుంది. వీటిలో ఈ సారి 29లో తృణమూల్, 15లో బిజెపి గెలుపొందాయి.

2016తో పోల్చుకున్నపుడు లెఫ్ట్ ఫ్రంట్ ఓటింగ్ 21.5 శాతం పడిపోయింది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో లెఫ్ట్ ఫ్రంట్ ఓటింగ్ శాతం 7.4 శాతం. అది ఈ అసెంబ్లీ ఎన్నికల్లో 5.6 శాతానికి పడిపోయింది. సీట్ల సర్దుబాటు మూలంగా మనం ఈ సారి పోటీ చేసిన స్థానాలు తగ్గిపోయాయి. 2021లో 138 స్థానాల్లో పోటీ చేసి, 4.73 శాతం ఓట్లు తెచ్చుకున్నాము.

**కొన్ని అంశాలు:** ఇంతకు ముందు మనం గుర్తించినట్లు ఈ ఎన్నికల ఫలితాలు దిగ్భ్రాంతికరమైనవి. దీనికి రాష్ట్ర పార్టీ నాయకత్వం తమదే బాధ్యత అని అంగీకరించింది. పార్టీ తీవ్రమైన ఆత్మవిమర్శతో అంతర్మథనం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ బాధ్యతను నెరవేర్చడానికి కేంద్ర కమిటీ కట్టుబడి ఉంది.

ఈ ఫలితాల అనంతరం, 2021 మే 5 న సమావేశమయిన పొలిట్‌బ్యూరో పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీకి ఒక నోట్ పంపింది. దానిలో ఎన్నికల సమీక్ష సమయంలో దృష్టి సారించాల్సిన కొన్ని ముఖ్యమైన అంశాలను తెలియ చేసింది. రాష్ట్ర కమిటీ ప్రాథమిక సమీక్ష పొలిట్ బ్యూరో నోట్‌లో పేర్కొన్న అంశాలను పరిశీలించింది. అయినప్పటికీ కొన్ని అంశాలను ఇంకా క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. పార్టీని ఐక్యం చేయడానికి అత్యవసరమైన ఈ అంశాలపై కేంద్రకమిటీ నిర్ధారణలకు రావలసి ఉంది. దేశవ్యాపితంగా పార్టీని దిగ్భ్రాంతికి గురిచేసిన ఈ

ఫలితాల ప్రభావం దృష్ట్యా ఇది చాల ముఖ్యమైనది. అందుచేత ఈ సమీక్ష ప్రధానంగా పశ్చిమ బెంగాల్ కమిటీకి సంబంధించిందే అయినప్పటికీ మొత్తం పార్టీకి కూడ ఎంతో ముఖ్యమైనది.

మరొక ముఖ్యమైన కారణం రీత్యా కూడ ఇది ముఖ్యమైనది. ప్రజాతంత్ర ఉద్యమంలో పశ్చిమ బెంగాల్ ముందు పీఠీన ఉంటుందని పార్టీ ఎల్లప్పుడూ భావిస్తూ ఉంది. ఆ పరిస్థితిని తిరిగి సంపాదించుకోవాలి. ముఖ్యమైన అంశాలలో సమిష్టి, సమైక్య అవగాహన ద్వారా దాన్ని తిరిగి తెచ్చుకోవాలి.

**తీవ్రంగా పడిపోయిన ప్రజాపునాది:** తీవ్ర ఆత్మవిమర్శతో అంతర్మథనం చేయాల్సిన ప్రధానమైన అంశం, మన ప్రజా పునాది, సామాజిక వర్గాలు మన వెనకకు రావడం తీవ్రంగా పడిపోవడం. ఈ క్రమం 2008 లో ఆరంభమయింది. అప్పటి నుండి పార్టీ మహాసభలతో సహా వివిధ స్థాయిల్లో ఈ ధోరణిని పరిశీలించి, దాని పునరుద్ధరణకు సరిదిద్దుకోవలసిన కొన్ని అంశాలను కూడ గుర్తించింది. పార్టీ నిర్మాణ ప్లీనం కూడ ఈ క్షీణతను అపుచేసి, వెనక్కి కొట్టడానికి తీసుకోవలసిన చర్యలను విపులంగా పేర్కొంది. అయినప్పటికీ, ఈ నిర్ణయాలను మనం సక్రమంగా అమలు చేయలేదన్న విసయాన్ని ఈ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నిర్ణయాలను పార్టీ ఎందుకు స్వంతం చేసుకోలేకపోయిందన్న విషయంపై ఆత్మవిమర్శనా పూర్వక అంతర్మథనం కొనసాగాలి. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి తీసుకోవలసిన చర్యలను గుర్తించడానికి, వాటిని అమలు చేయడానికి రాబోయే పార్టీ మహాసభను కూడ వినియోగించుకోవాలి.

2008 నుండి ఈ కాలంలో మన పార్టీ ఫాసిస్టు దాడుల రూపంలో తీవ్రమైన అణచివేతను ఎదుర్కోవలసి వచ్చింది. ఈ దాడులను ప్రతిఘటించడం కూడ జరిగింది. 2011-18 మధ్య కాలంలో మనం 746 మందిని కోల్పోయాము. ఈ కాలంలో మన పార్టీ సభ్యులు, సానుభూతి పరులు 1 లక్ష 2 వేల మందికి పైగా ఇళ్ళ నుండి వెళ్ళగొట్ట బడ్డారు. వీరందరికీ పట్టణ ప్రాంతాలలో పార్టీ ఆశ్రయం కల్పించాల్సి వచ్చింది. మన పార్టీ సభ్యులు, సానుభూతి పరులపై తప్పుడు కేసులు బనాయించబడి, తీవ్రమైన అణచివేతకు, బెదిరింపులకు గురయ్యారు. ఇలాంటి బీభత్స పరిస్థితి, హింసాకాండ మూలంగా మన వెనక ఉన్న ఎక్కువ మంది జనం ధైర్యం కోల్పోవడానికి దారి తీసింది.

ఈ కాలంలో పార్టీ, ప్రజా సంఘాలు అనేక పెద్ద పెద్ద పోరాటాలు నిర్వహించాయి. కేంద్ర, రాష్ట్ర స్థాయి పిలుపులకు అనుగుణంగా పెద్ద ఎత్తున జనాన్ని

సమీకరించారు. అనేక నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. బ్రిగేడ్ మైదానంలో 10 లక్షల మందికి పైగా జనంతో ర్యాలీలు నిర్వహించబడినాయి. అయితే, ఇంతటి భారీ జనసమీకరణలు కాని, కార్యాచరణలు కాని ఎన్నికల్లో మెరుగైన ఫలితాల రూపంలోకి ఎందుకు మారలేదన్నది, మన ప్రజాపునాది క్షీణతను ఎందుకు నిరోధించలేదన్నది ప్రశ్న.

రాష్ట్రంలో పరిస్థితిని సక్రమంగా అంచనా వేయడంలో మన ప్రజాపునాది క్షీణతకు దారితీసిన ఈ క్రింది రెండు అంశాలను సరియైన విధంగా పరిగణనలోకి తీసుకోలేదు.

**మితవాదం వైపుకు రాజకీయ మార్పు:** ఈ కాలంలో ఆరెస్సెస్ పశ్చిమ బెంగాల్‌లో వేగంగా విస్తరించింది. ఆరెస్సెస్ శాఖల సంఖ్య, తీవ్రమైన మతపరమైన విభజన కోసం హిందూత్వ అజెండా ప్రచారం గణనీయంగా పెరిగింది. ఇది దేశ వ్యాపితంగా ఆరెస్సెస్, బిజెపిల పెరుగుదలలో, ప్రత్యేకించి 2014 లో మోడి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన పెరుగుదలలో భాగమే. హిందూత్వ మత ఓట్ బ్యాంకును పటిష్టం చేసుకోవడదానికి, యుద్ధోన్మాద జాతీయ దురహంకార ప్రచారానికి ఇది దారితీసింది.

ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభం ఫలితంగా ఈ రాజకీయ మితవాద మొగ్గు వెనక ఉన్న కారణాలను మన పార్టీ 22వ మహాసభ రాజకీయ తీర్మానం స్పష్టంగా విశదీకరించింది. కోవిడ్ మహమ్మారిని వినియోగించుకోవడంతో మితవాద శక్తులు మరింత బలపడ్డాయి. వర్ణవివక్ష, పరాయివారి పట్ల ద్వేషం ప్రపంచవ్యాపితంగా తీవ్రమయ్యాయి. ఈ పరిణామం ప్రభావం భారత దేశంలో ఉన్మాద పూరిత మతతత్వం, మత విభజన పెరగడంలో వ్యక్తమయింది. ఈ పరిణామం బెంగాల్‌లో ఎలాంటి ప్రభావం చూపింది, లౌకికతత్వ బలాన్ని ఎంతవరకు దెబ్బతీసింది, మన వెనక ఉన్న ప్రజాపునాదిలోని సెక్షన్లపై ఎంతటి ప్రభావం కలిగించింది– అన్న విషయాలను నిశితంగా అంచనా వేసి తిప్పికొట్టాలి. ఆరెస్సెస్, బిజెపి పాల్పడుతున్న ఈ మతతత్వ ఎదురుదాడిని మన పార్టీ మహాసభ చెప్పినట్లు, సైద్ధాంతిక, రాజకీయ, వ్యవస్థాగత, సాంస్కృతిక– ఇలా అన్ని రకాల స్థాయిల్లో ఎదుర్కొనాలి.

**మన సమాజంలో వర్గ మార్పులు:** నయా ఉదారవాద సంస్కరణల ప్రభావం భారత సమాజంపై ఎలా ఉందన్న అంశాన్ని కేంద్ర కమిటీ తీవ్రంగా పరిశీలించింది. ఆయా రంగాలలో ఎలాంటి మార్పులు జరిగాయన్న అంశాన్ని అధ్యయనం చేయడానికి నిర్దిష్టంగా కొన్ని కమిషన్లను నియమించింది. ఆ కమిషన్ల రిపోర్టులను కేంద్ర కమిటీ

చర్చించింది. ఆ చర్చల ఆధారంగా కొన్ని నిర్మాణపరమైన నిర్ణయాలు తీసుకోబడినాయి. 2015 నిర్మాణ ప్లీనం ఆ నిర్ణయాలలో చాల వాటికి నిర్దిష్ట రూపాన్ని ఇచ్చింది.

అదే విధమైన నిర్దిష్ట అధ్యయనాన్ని పశ్చిమ బెంగాల్‌తో సహా అన్ని రాష్ట్ర కమిటీలు చేపట్టాయి. కాని వర్గ మార్పులపై జరిగిన ఆ నిర్దిష్ట అధ్యయన ఫలితాల ఆధారంగా, ఆ మార్పుల ప్రభావం పార్టీ నిర్మాణంపై ఎలా ఉంటుంది, ప్రజలను సమీకరించడానికి ప్రత్యేకించి మనకు గట్టి వెన్నుదన్నుగా ఉన్న గ్రామీణ పేదలను సమీకరించడానికి ఎలాంటి నినాదాలు, ఎత్తుగడలు అనుసరించాలి అన్న అంశం మాత్రం సమర్ధవంతంగా రూపుదాల్చలేదు. ఈ బలహీనతపై తక్షణం కేంద్రీకరించాలి. గ్రామీణ పేదలు, ఇతర బలహీన వర్గాలు ఈ ఎన్నికల్లో మన నుండి వేరుపడటంలో ఈ బలహీనత ప్రభావం కనిపించింది. ఈ సమస్యను తక్షణం చేపట్టి, రాజకీయ, నిర్మాణ మార్పులకు నిర్దిష్ట మార్గాన్ని రూపొందించుకోవాలి. **తృణమూల్, బిజెపిల మధ్య తీవ్రమైన విభజన:** 2019 లోక్ సభ ఎన్నికల్లో మనం ఏ అసెంబ్లీ నియోజకవర్గ సెగ్మెంట్‌లోను మెజారిటీ ఓట్లు సంపాదించలేదని గమనించిన పార్టీ తృణమూల్, బిజెపిల మధ్య తీవ్రమైన విభజన జరిగిందని గుర్తించింది. ఈ రెండు ధృవాల మధ్య విభజనను బద్దలు కొట్టాలని నిర్ణయించబడింది. అనేక పోరాటాలు, భారీ సమీకరణలు జరిపినప్పటికీ 2019–21 మధ్య రాజకీయ బలాబలాల పరిస్థితిలో మార్పు లేదని, 2019 ఎలా ఉందో అలానే ఉందని 2021 అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్ర కమిటీ నిర్ధారణకొచ్చింది.

సిపిఐ(ఎం) ఓటింగ్ శాతం 2016లో 19.75 శాతం ఉంటే, 2016 నాటికి 6.28 శాతానికి, 2021లో మరింతగా 4.73 శాతానికి పడిపోయింది.

రెండు ధృవాల మధ్య రాజకీయ కేంద్రీకరణ పరిస్థితి గత కొన్ని సంవత్సరాలుగా బలపడుతూ వస్తున్నది. 2019 ఎన్నికల సమయంలోను, అనంతరము ఇది తీవ్రతరమయింది. ఇతర ఏ రకమైన ప్రత్యామ్నాయాన్ని చొరబడనీయని, ఈ కేంద్రీకరణను కార్పొరేట్ మీడియా, పాలక వర్గాలలోని పలుకుబడికలిగిన సెక్షన్లు చురుగ్గా మద్దతు ఇచ్చి, ప్రోత్సహించాయి. అయితే, ఈ రకమైన రెండు ధృవాల కేంద్రీకరణ కోసం తృణమూల్, బిజెపిలు కుమ్మక్కయ్యాయన్న నిర్ధారణకు రావడం మాత్రం సరికాదు.

నిజానికి రాష్ట్రంలో బిజెపి కాలూనడానికి తృణమూల్ పార్టీ వాహకంగా పనిచేసింది. బిజెపితో తృణమూల్ సుదీర్ఘ కాలం పొత్తు నెరపింది. బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ లో భాగస్వామిగా కొనసాగింది. వాజ్‌పాయ్ ప్రధానిగా ఉ

న్నపుడు కేంద్ర క్యాబినెట్ లో కూడ ఉంది. దేశవ్యాపితంగా బిజెపి పెరిగిన నేపథ్యంలో ఆ పార్టీ అన్ని రాష్ట్రాలలోను అదుపు సాధించాలని ప్రయత్నిస్తున్నపుడే తృణమూల్, బిజెపిల మధ్య తేడాలచ్చాయి. ఈ మితవాద మొగ్గు, మతపరమైన విభజనల దేశవ్యాపిత దూకుడు పెరుగుతూ వస్తున్నది. బెంగాల్‌లో ఇది తృణమూల్ ఆధిపత్యానికి సవాలుగా తయారయింది. బెంగాల్‌ను పట్టుకోవాలన్న నినాదంతో బిజెపి తన దూకుడును కొనసాగించింది.

తృణమూల్ నుండి బిజెపిలోకి పెద్ద ఎత్తున ఫిరాయింపులు జరగడాన్ని, ఎన్నికల అనంతరం వారు మళ్ళీ వెనక్కి రావడాన్ని రెండు ధృవాల కేంద్రీకరణ కోసం ఇరు పార్టీల కుమ్మక్కు అని మనం పొరపాటు అంచనాకొచ్చాము. ఆరెస్సెస్ దాని రాజకీయ ఫ్రంటులు తొలుత జనసంఘ్, ఇప్పుడు బిజెపిలు నూతన ప్రాంతాలలోకి విస్తరించాలని పెట్టుకున్న రాజకీయ ఫ్రంటులు అవి ఏ జాతీయ, ప్రాంతీయ పార్టీతో అయితే పొత్తు పెట్టుకున్నాయో చివరికి ఆ పార్టీని బలహీనపరిచి అంతం చేశాయి. 1960వ దశకం మధ్యలో పొత్తుపెట్టుకున్న సోషలిస్టు పార్టీ విషయంలో ఇదే జరిగింది. పలు ప్రాంతీయ పార్టీల అనుభవం కూడ ఇదే. అస్సాం లో ఎజిపి లాంటి పార్టీ బిజెపితో పొత్తు పెట్టుకున్న తర్వాత బలహీనపడి పోయింది.

మోడీ–షాల ద్వయం ప్రతిపక్ష పార్టీల పట్ల త్రిముఖ వ్యూహాన్ని అనుసరించింది. మొదటిది పెద్ద మొత్తంలో డబ్బు ఇవ్వడం, ముఖ్యమైన పదవుల ఆశ చూపడం, రెండవది, కేంద్ర ప్రభుత్వ సంస్థల దాడులతో భయపెట్టడం, బెదిరించడం, చివరిగా మూడవది కేసుల్లో ఇరికించడం, జైలుపాలు చేయడం. గోవాలోను, కర్నాటకలోను, మధ్య ప్రదేశ్‌లోను, ఈశాన్య భారతంలోను ఎన్నికైన ప్రభుత్వాలను బిజెపి ఎలా కూలదోసిందీ మనం చూశాం. ఈ కార్యకలాపాలు సుదీర్ఘకాలం మిత్రులగా ఉన్న శివసేన, అకాలీదళ్ లాంటి పార్టీలు సైతం ఘర్షణ పడేలా చేశాయి.

ప్రాంతీయ పార్టీల నాయకత్వంలోని ప్రభుత్వాల హక్కులపైన, ఫెడరలిజం పైన బిజెపి కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తున్నది. ఆరెస్సెస్ ప్రచారక్‌లను గవర్నర్లుగా నియమించి నిస్సిగ్గుగా జోక్యం చేసుకోవడం పాలక ప్రాంతీయ పార్టీలకు, బిజెపికి మధ్య ఘర్షణ వాతావారణాన్ని సృష్టిస్తున్నది.

దీని ఫలితంగా పాలక తృణమూల్ పార్టీకి, బిజెపికి మధ్య ఏర్పడిన శతృవాతావరణాన్ని మనం తక్కువ అంచనా వేశాం. ఇది బిజెపి వ్యతిరేక ప్రచారపు పదునును నీరుగార్చింది. ఆచరణలో మనం తరచు బిజెపిని, తృణమూల్‌ను ఒకే

గాటన కట్టాము. మన పార్టీ పైనాయకత్వ వైఖరి బిజెపియే ప్రధాన శత్రువు అని చెబుతున్నప్పటికీ ఇది జరిగింది. దీనితో బిజెపిని వ్యతిరేకించి, లౌకికతత్వాన్ని కాపాడటంలో మన రాజీలేని వైఖరి దెబ్బతిన్నది.

నూతన భారత దేశం కోసం బిజెపి ఇచ్చిన పిలుపు, బెంగాల్‌ను స్వాధీనం చేసుకోవడానికి దూకుడుగా ముందుకు సాగడం బెంగాల్ ప్రజానీకంలో బిజెపి వ్యతిరేక ప్రతిఘటన పటిష్టమవడంలో పెద్ద పాత్ర వహించింది.

**పాలక తృణమూల్ ప్రభుత్వం పట్ల వ్యతిరేకతను అతిగా అంచనా వేయడం:** తృణమూల్ ప్రభుత్వం పట్ల వ్యతిరేకత ఉందన్న మాట వాస్తవం. ఆ వ్యతిరేకత 2019 లోక్ సభ ఎన్నికల్లో స్పష్టంగా వ్యక్తమయింది.

అయితే, ఈ ప్రతికూలతను అధిగమించడానికి తృణమూల్ చేసిన ప్రయత్నాలను మనం తక్కువ అంచనా వేశాం. ఒక వైపున, ప్రజలకు ఎంతో అవసరమైన సంక్షేమ చర్యలను ప్రభుత్వం చేపట్టింది. మనం వీటిని 'తాయిలం రాజకీయం' అని కొట్టిపారేయడం పొరపాటు. ఈ సంక్షేమ చర్యల వల్లనే తృణమూల్‌ను వీడివెళ్ళిన ఒక సెక్షను మళ్ళీ దగ్గరయింది.

రెండవది, ప్రధాన మంత్రి, కేంద్ర హోం మంత్రి ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా చేసిన వ్యక్తిగత దాడి, ప్రభుత్వం గోలియత్‌ను ఎదుర్కొంటున్న డేవిడ్ (పెద్ద శత్రువుపై పిల్లవాడు తలపడటం) అన్న వాతావరణాన్ని కల్పించింది. ఇది ప్రజల్లో తృణమూల్‌కు సానుభూతిని సంపాదించి పెట్టింది. ముఖ్యమంత్రి వీల్‌చైర్‌లో ప్రచారం చేయడం కూడ ఈ సానుభూతిని మరింత పెంచింది. ఆమె తన గాయాన్ని ఎంత అతిగా చూపించినప్పటికీ, ఇది ప్రజల్లో ప్రత్యేకించి మహిళా ఓటర్లలో పెద్దఎత్తున సానుభూతి రగిల్చింది.

మూడవది, ప్రభుత్వం ఒక రకమైన సామాజిక ఇంజనీరింగ్‌ను అనుసరిస్తూ, నిర్దిష్ట సెక్షనుకు నిర్దిష్ట రాయితీలు కల్పిస్తూ వారి మద్దతును పొందకలిగింది.

అంతర్మథనంతో చూడాల్సిన ఈ అంశాలను మనం సక్రమంగా పరిగణనలోకి తీసుకోలేదు.

**భూసమస్య:** లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం అమలు చేసిన భూ సంస్కరణలు, అనుసరించిన ప్రజానుకూల విధానాలు మైనారిటీల, దళితుల, ఇతర బలహీన వర్గాల మద్దతును మనకు అందిస్తాయన్న భావనతో మనం ప్రచారాన్ని కొనసాగించాం. నందిగ్రాం పరిణామాల సమయంలో మనం ఇచ్చిన 'భూమి మన పునాది, పారిశ్రామికీకరణ మన భవిష్యత్తు' అన్న నినాదాన్ని ఈ ఎన్నికల్లో సైతం

కొనసాగించాం. కాని ఈ ప్రచారం ప్రజల్లో ఆనాటి భూసేకరణ అనుభవాల జ్ఞాపకాలను మేల్కల్పింది. ఇది కూడ ఆనాటి భూసేకరణ విధానాల కొనసాగింపే అన్న భావన ప్రజల్లో కలిగించింది. ఫలితంగా గ్రామీణ ప్రజానీకం లెఫ్ట్ ఫ్రంట్ దగ్గరకు రాలేదు. అంతేకాదు, ప్రస్తుతం తీవ్రమైన వ్యవసాయ సంక్షోభం నెలకొని ఉంది, వ్యవసాయ చట్టాల రద్దు కోసం రైతాంగం పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నది, కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయాలని డిమాండ్ చేస్తున్నది. రైతుల నుండి భూమలను ప్రత్యేకించి భూమాఫియాలు బీభత్స చర్యలకు, బెదిరింపులకు పాల్పడి లాక్కుంటారన్న మాటలు వినవస్తున్నాయి, ఇలాంటి పరిస్థితిలో మన ప్రచారం రైతాంగాన్ని మరింత దూరం చేసింది.

**అస్తిత్వ రాజకీయాలు:** అస్తిత్వ రాజకీయాల ప్రభావాన్ని తక్కువ అంచనా వేయడం, మనం ఈ సమస్యలను సరియైన రీతిలో చూడటంలో వైఫల్యానికి దారితీసింది. మైనారిటీల హోదా, సంక్షేమం గురించి సచార్ కమిటీ గుర్తించిన మూడు అంశాలు– భద్రత, సమానత, అస్తిత్వం. వీటిలో మనం ప్రదానంగా మొదటి దానిపై మాత్రమే కేంద్రీకరించాం. భద్రతను అతిగా నొక్కిచెప్పడం మైనారిటీల ఆకాంక్షలను నెరవేర్చడానికి సరిపోదు అని లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వపు చివరి సంవత్సరాలలో పార్టీ సైతం అంచనా వేసింది. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు ఎలాంటి మత ఘర్షణలు, సంఘటనలు జరగకుండా ఉన్న పరిస్థితిని మైనారిటీలు 'దానంతటదే' వచ్చిందిగా భావించారు. జీవన పరిస్థితుల మెరుగుదల, ఉపాధి లాంటి సమస్యలు దాదాపు పట్టించుకోకుండా వదిలి వేయబడ్డాయి. దీన్ని మనం సరిదిద్దుకొని, తులనాత్మక వైఖరిని రూపొందించుకోవాలి. భద్రత సమస్యతో పాటు, అస్తిత్వం, సమానత్వం అంశాలను కూడ వర్గ రాజకీయాలు, పోరాటాల్లో భాగం చేయాలి. అయితే, అస్తిత్వ రాజకీయాల ఉచ్చులో పడకుండా జాగ్రత్త వహించాలి. అలా కానట్లయితే, అస్తిత్వ అంశాలు వర్గ అంశాలపై పైచేయి సాధిస్తాయి, వర్గాలు, వర్గపోరాటమే తిరస్కరించబడుతుంది.

షెడ్యూలు కులాలకు సంబంధించిన కొన్ని నిర్దిష్ట సమస్యలున్నాయి. వాటిని సక్రమంగా అంచనా వేసి, వాటిపై దృష్టి కేంద్రీకరించాలి. ప్రత్యేకించి ఉత్తర బెంగాల్‌లో గిరిజన సమస్యలున్నాయి. వీరిలో జాతి దురభిమానాన్ని రెచ్చగొట్టి ప్రజల మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి బిజెపి, తృణమూల్‌లు చేస్తున్న ప్రయత్నాలను సరైన విధంగా తిప్పికొట్టాలి. **సంయుక్త మోర్చా– ప్రత్యామ్నాయ ప్రభుత్వం:** బిజెపి వ్యతిరేక, తృణమూల్ వ్యతిరేకం ఓటర్లను అత్యధికంగా ఒక దగ్గర చేర్చడానికి ఇతరులతో ఎన్నికల సర్దుబాట్లు చేసుకోవాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది. కాని ఎన్నికల

ప్రచార క్రమంలో కాంగ్రెస్‌తోను, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్‌తోను సర్దుబాటు సంయక్త మోర్చాగా ప్రత్యామ్నాయ ప్రభుత్వం కోసం ఐక్య సంఘటనగా పిలవబడింది. ఇది తప్పు, ఇది కేంద్ర కమిటీ అవగాహనకు అనుగుణంగా లేదు.

సంయుక్త మోర్చా అనేది ఉమ్మడి మేనిఫెస్టో లేదా కార్యక్రమం కలిగిన ఒక శాశ్వత ఏర్పాటు, లేదా యునైటెడ్ ఫ్రంట్ కాజాలదు. ఎన్నికల సమయంలో ఈ అభ్యర్థులకు ప్రజల మద్దతు కోరుతూ ఒక ఉమ్మడి పిలుపు ఇవ్వబడింది.

సీట్ల సర్దుబాటు ప్రాతిపదికన ఏర్పడిన ఈ ఎన్నికల అవగాహనలో సైతం ఐఎస్ఎఫ్‌ను కాంగ్రెస్ దాదాపు పట్టించుకోకపోవడంతో ఐక్యత కొరవడింది. ఐఎస్ఎఫ్ కు లౌకిక స్వభావం కలిగిన కార్యక్రమం ఉంది, అది నిలబెట్టిన అభ్యర్థులు కూడ అలాంటి వారే, బలహీన వర్గాల నుండి ఎంపిక చేయబడినవారు. అయినప్పటికీ అది ముస్లిం మైనారిటీల సంస్థ అనే ముద్రను చెరిపివేయలేక పోయింది.

భవిష్యత్తులో నిర్దిష్ట అంశాలపై లెఫ్ట్ ఫ్రంట్‌తో పాటు ఇతర ప్రజాతంత్ర సెక్షన్లను కలుపుకొని ఉమ్మడి కార్యక్రమాలను, పోరాటాలను చేపట్టాలి. అదే విధంగా, రాబోయే అసెంబ్లీ ఉప ఎన్నికల్లోను, స్థానిక సంస్థల ఎన్నికల్లోను బిజెపి వ్యతిరేక, తృణమూల్ వ్యతిరేక లౌకిక శక్తులతో ఎన్నికల అవగాహన కొనసాగుతుంది.

**పార్టీ భవిష్యత్ కర్తవ్యాలు:** పార్టీ రాష్ట్ర కమిటీ పేర్కొన్న చేపట్టిన కర్తవ్యాలలో క్రింది వాటికి ప్రాధాన్యత ఇవ్వాలి.

బిజెపిని, బెంగాల్‌ను స్వాధీనం చేసుకోవాలన్న దాని ప్రయత్నాలను ఓడించాలన్న భావోద్వేగం ఈ ఎన్నికల్లో బెంగాల్ ప్రజల్లో వ్యక్తమైంది. అది నెరవేరింది కాబట్టి ఇప్పుడు ప్రజల జీవనభృతి సమస్యలు ముందుకొస్తాయి. ప్రజల ప్రయోజనాలసమస్యలను చేపట్టి రాజకీయాలలో పాల్గనాల్సిన సమయం ఇది. మన పార్టీ అప్రమత్తంగా ఉండి ఈ సమస్యలను లేవనెత్తడానికి సిద్ధంగా ఉండాలి. ప్రజలను ప్రతేకించి దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు లాంటి బలహీన వర్గాలను వారి వారి సమస్యలపై సమీకరించి కార్యాచరణ లోకి దింపాలి. పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించాలి.

**నిర్మాణ కర్తవ్యాలు**: ప్రజా పోరాటాల ద్వారా అలాంటి రాజకీయ నాయకత్వం వహించే శక్తి పదే పదే చెప్పినట్లు మన స్వతంత్ర బలం మీద, రాజకీయంగా జోక్యం చేసుకునే శక్తి మీద ఆధారపడుతుంది. ఈ దిశగా 2008 నుండి పార్టీ వివిధ స్థాయిల్లో తీసుకున్న అన్ని నిర్ణయాలను సరియైన విధంగా సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఆత్మవిమర్శనా పూర్వక అంతర్మథనం అంటే అర్థం ఇదే. గతంలో తీసుకున్న నిర్ణయాలు

ఎందుకు సక్రమంగా అమలు కాలేదన్న విషయాన్ని పరిశీలించాలి. బలహీనతలను గుర్తించి, అధిగమించాలి. నిర్ణయాలను అమలు చేయడానికి శాయశక్తులా కృషి చేయాలి.

చాల కాలం నుండి పార్టీ నిర్మాణ స్థాయి బలహీనపడిపోతున్నది. కలకత్తా ప్లీనం సూచించిన పద్ధతుల్లో పార్టీని దారిలో పెట్టడానికి, చురుగ్గా పనిచేయించడానికి మనం ప్రయత్నిస్తున్నాం. అయినప్పటికీ తీవ్రమైన బలహీనతలు అలాగే ఉన్నాయి.

ప్రస్తుత పరిస్థితిలో హిందూత్వకు వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటాలు, ప్రచారాలను పెద్ద ఎత్తున బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. లౌకికతత్వం పట్ల బెంగాల్ ప్రజల నిబద్ధత చెక్కుచెదరనిదన్న భావనతో మనం ఉండకూడదు. మనకు దేశ విభజన, దాని అనంతరం చెలరేగిన మత కల్లోలాల అనుభవాల చరిత్ర ఉంది. ఆరెస్సెస్–బిజెపిలు ఆనాటి జ్ఞాపకాలను తిరగదోడి, తమ హిందూత్వ ప్రచారాన్ని విస్తరించాలని ప్రయత్నిస్తున్నాయి. ఇంతకు ముందు చెప్పినట్లు, హిందూత్వ భావనలకు వ్యతిరేకంగా పోరాటాలు, సైద్ధాంతిక, రాజకీయ, సాంస్కృతిక, తదితర రంగాలలో జరగాలి.

మన పార్టీ నుండి తృణమూల్‌కు ఫిరాయింపులు జరిగాయి. అక్కడనుండి బిజెపిలోకి కూడ వెళ్ళారు. పార్టీలో రాజకీయ, సైద్ధాంతిక తీవ్రంగా దెబ్బతిన్నదన్న విషయం దీన్నిబట్టి స్పష్టమవుతున్నది. ఎన్నికల సందర్భంగా పార్టీ కమిటీలు, బూత్ కమిటీలు గుర్తించిన బలహీనతలను సరిచేయాలి. పరిష్కార చర్యలను తక్షణం చేపట్టాలి. మన వెనకున్న ప్రజాపునాదిని దెబ్బతీయడానికి తృణమూల్ నిరంతరం చేస్తున్న దాడులనుండి రక్షించుకోవాలి, ఆ దాడులకు గురైన మన కార్యకర్తలను కాపాడు కోవాలి.

మన ప్రజాసంఘాలను చురుగ్గా పనిచేయించాల్సిన అవసరం ఉంది. అవి స్వతంత్రంగా పనిచేసేలా చూడాలి. కేంద్ర కమిటీ తీర్మానాల్లో చెప్పినట్లు పార్టీ, ప్రజాసంఘాల మధ్య సంబంధంలో సమతుల్యత పాటించాలి.

లెఫ్ట్ ఫ్రంట్‌ను దాని మిత్రులను పటిష్టం చేసుకోవడానికి కృషి సల్పాలి. ఉమ్మడి అంగీకృత అంశాలపై ఉమ్మడి కార్యాచరణకు, పోరాటాలకు కలిసొచ్చే శక్తులను కలుపుకొని ఈ శక్తుల మధ్య విశాలమైన ఐక్యతను సాధించాలి.

ఎన్నికల అనంతరం ఇప్పుడు ప్రజల మనుగడ కోసం, మెరుగైన జీవితం కోసం జరిపే వర్గ, ప్రజా పోరాటాలకు మంచి అవకాశం ఉందని ఇంతకు ముందు చెప్పుకున్నాము. దృఢ విశ్వాసంతో ఈ ప్రజాపోరాటాలను ఆరంభించడానికి మనం

సన్నద్ధం కావలసిన సమయం ఇది. ఆత్మస్థైర్యం కోల్పోవడం కాదు, వర్గ పోరాటాలను పునరుద్ధరించి, ప్రజలతో మన సంబంధాన్ని తిరిగి బలోపేతం చేసుకోవాల్సిన సమయం ఇది.

## తమిళనాడు, పుదుచ్చేరి

తమిళనాడు అసెంబ్లీకి (234 స్థానాలు), పుదుచ్చేరి అసెంబ్లీకి (30 స్థానాలు), పార్లమెంటరీ ఉప ఎన్నిక ఏప్రిల్ 6 న ఒకే దఫాగా జరిగాయి. ప్రధాన పోటీ అన్నాడిఎంకె–బిజెపి కూటమికి, డిఎంకె నాయకత్వంలోని సెక్యులర్ కూటమికి మధ్య జరిగింది.

అన్నాడిఎంకె, బిజెపి కూటమి జయలలిత మరణించిన తర్వాత కూడ అంతులేని అవినీతితో, పాలనాపరమైన అక్రమాలతో, ప్రజావ్యతిరేక చర్యలతో, కేంద్రంలో బిజెపికి, దాని విధానాలకు గట్టి మద్దతు అందిస్తూనూ కొనసాగింది. బిజెపి అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలు, సంస్కరణలు, కార్పొరేట్ పెట్టుబడిదారీ విధానాన్ని ముందుకు తీసుకు వెళ్ళడం, జాతీయ వనరులను పెద్ద ఎత్తున లూటీ చేయడం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం, ఫెడరలిజానికి, ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాల హక్కులకు తూట్లు పొడవడం, హిందూత్వ రాజకీయాలను దూకుడుగా ముందుకు తీసుకు వెళ్ళడం– వీటన్నింటికి ఎఐడిఎంకె మద్దతు ఇచ్చింది. బిజెపి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ ప్రజావ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక చర్యలన్నింటికీ వ్యతిరేకంగా సిపిఐ(ఎ) పెద్ద ఎత్తున నిరసనలు, పోరాటాలు నిర్వహించింది. అన్నాడిఎంకె, బిజెపిల కూటమిని ఓడించడం, రాష్ట్ర ప్రభుత్వ పాలన నుండి తొలగించడం ఈ ఎన్నికల్లో అత్యవసరంగా మారింది.

ఈ అవగాహనతో పార్టీ డిఎంకె నాయకత్వంలోని లౌకిక కూటమితో కలిసి ఎన్నికల సర్దుబాటు చేసుకోవాలని నిర్ణయించింది. డిఎంకె నాయకత్వంలోని ఈ కూటమిలో డిఎంకె, కాంగ్రెస్, ఎండిఎంకె, సిపిఐ(ఎం), సిపిఐ, విసికె, ఎంఎంకె, ఎఐఎంఎల్, కొంగు మకల్ కచి, తమిజగ వజురిమై కటచి, ఫార్వర్డ్ బ్లాక్ లు ఉన్నాయి. వీటిలో కాంగ్రెస్, సిపిఐ(ఎం), సిపిఐ, విసికె, ముస్లిం లీగ్ లు మినహా మిగతా అన్ని పార్టీలు డిఎంకె చిహ్నం ఉదయించే సూర్యుడు గుర్తుపైనే (15 స్థానాలు) పోటీ చేశాయి.

డిఎంకె నాయకత్వంలోని కూటమి విజయం సాధించింది. డిఎంకె ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

**డిఎంకె కూటమి సాధించిన ఫలితాలు:** డిఎంకె నాయకత్వంలోని కూటమికి

159 స్థానాలు, 45.39 శాతం ఓట్లు లభించాయి. (డిఎంకె ఉదయించే సూర్యుడు గుర్తుకు 37.7 శాతం ఓట్లు లభించాయి.) డిఎంకె గుర్తుపైన డిఎంకె దాని మిత్రపక్షాలు 188 స్థానాలకు పోటీ చేసి 133 స్థానాలు గెలుచుకున్నాయి. డిఎంకె ఒక్కటే 173 స్థానాలకు పోటీ చేసి, 125 స్థానాలు గెలుపొందింది. మిగిలిన మిత్రపక్షాలు 61 స్థానాలకు పోటీ చేసి 34 స్థానాలు గెలుచుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అనుసరించే విధానాలపైన, అవినీతిపైన, ప్రజల జీవన భృతి సమస్యలపైన నిరంతర ప్రజా ఉద్యమాలను నిర్వహించడం, మతపరమైన విభజనను తీవ్రం చేయడానికి బిజెపి చేసే ప్రయత్నాలను ప్రతిఘటించడం– డిఎంకె కూటమి విజయం సాధించడానికి ప్రధాన కారణాలు. మైనారిటీలు, మధ్యతరగతిలో ఒక గణనీయమైన సెక్షను, షెడ్యూలు కులాలు, ప్రభుత్వాధికారులు, ఉద్యోగులు ఈ కూటమికి ఓటు చేశారు.

కూటమి విజయం సాధించినప్పటికీ ఒక విషయాన్ని గమనించాలి. 2019 లోక్ సభ ఎన్నికల్లో ఈ కూటమికి 51.46 శాతం ఓట్లు వస్తే, ఇప్పుడు 45.39 శాతం మాత్రమే వచ్చాయి. లోక్ సభ ఎన్నికల అనంతరం అన్నా డిఎంకె ప్రభుత్వం పొంగల్ ఉపశమనం, రైతుల రుణ మాఫీ, బంగారు ఆభరణాల రుణాల రద్దు, వనియార్లకు 10.5 శాతం రిజర్వేషన్లు మొదలైన చర్యలు కొంత వరకు కారణం. ఓట్ల కోసం అన్నాడిఎంకె కుల భావనలను కూడ రెచ్చగొట్టింది. ముఖ్యమంత్రి సామాజిక నేపథ్యం కూడ ఒక కారణం.

**అన్నా డిఎంకె సాధించిన ఫలితాలు:** పైన పేర్కొన్న ప్రభుత్వ చర్యలు అన్నాడిఎంకె కూటమికి కొంత వరకు ఉపయోగపడ్డాయి. లోక్ సభ ఎన్నికల్లో ఈ కూటమికి 30.29 శాతం ఓట్లు లభిస్తే, ఈ ఎన్నికల్లో 39.72 శాతం ఓట్లు లభించాయి. వనియార్‌లకు రిజర్వేషన్లు కొంత మేరకు లాభించినప్పటికీ, అది ఇతర కులాల వారిని దూరం చేసింది. దేవేంద్రకుల వెల్లెలార్ గా పేరు మార్చడంతో షెడ్యూలు కులాలలోని కొన్ని సెక్షన్లు దూరమయ్యాయి. అన్నా డిఎంకె, బిజెపి, పిఎంకె, తమిళ మణిల కాంగ్రెస్ కూటమిగా పోటీ చేశాయి. ఈ కూటమికి 39.72 శాతం ఓట్లు లభించాయి. అన్నాడిఎంకెకు 66 సీట్లు, 33.29 శాతం ఓట్లు లభించాయి. పిఎంకె పోటీ చేసిన 23 స్థానాలకు 5 స్థానాలను, బిజెపి పోటీ చేసిన 20 స్థానాలకు 4 స్థానాలను గెలుచుకున్నాయి.

4 స్థానాలలో గెలుపొందిన బిజెపికి 2.62 శాతం ఓట్లు లభించాయి. రాష్ట్రంలో తన హిందూత్వ మతతత్వ రాజకీయాలను వ్యాప్తి చేయడానికి ఈ విజయాన్ని బిజెపి వినియోగించుకునే ప్రమాదం నిజంగా ఉంది. లోక్ సభ ఎన్నికల్లో 3.72 శాతం ఓట్లు సంపాదించిన కమల్ హసన్ పార్టీ ఎంఎన్ఎం ఈ ఎన్నికల్లో 2.72

శాతం ఓట్లనే సంపాదించింది.

అన్నాడిఎంకె, బిజెపి కూటమి ఎన్నికల్లో ధనబలాన్ని విపరీతంగా ప్రదర్శించింది. ఇంతకు ముందెన్నడూ లేనంతగా ఎన్నికల ప్రచారానికి, జన సమీకరణ కోసం ఖర్చు పెట్టారు. పార్టీ కార్యకర్తలకు, ఓటర్లకు డబ్బులు పంచారు. ఎన్నికల క్రమాన్ని ఇది చాలమట్టుకు అవినీతిమయం చేసి, రాజకీయరహితం చేసింది.

దశాబ్దాల తరబడి కొనసాగుతున్న అన్నా డిఎంకె, డిఎంకె అనే రెండు ధృవాల మధ్య కేంద్రీకరణ ఈ ఎన్నికల్లో కూడ జరిగింది. ఈ రెండు పార్టీలకే 70 శాతం ఓట్లు లభించాయి. ఈ ద్విధృవ కేంద్రీకరణను బద్దలు కొట్టడానికి చేసిన అన్ని ప్రయత్నాలు ఇంతవరకు విజయం సాధించలేదు. ఈ రెండు పార్టీల నాయకత్వంలోనే కూటములు పోటీ చేయడం ఈ ధోరణిని మరింత పటిష్టం చేసింది.

**సిపిఐ(ఎం) సాధించిన ఫలితాలు:** మన అవగాహన ప్రాతిపదికగాను, డిఎంకె నాయకత్వంలోని లౌకిక కూటమిలో భాగస్వామి కావాలన్న కేంద్ర కమిటీ నిర్ణయానికి అనుగుణంగాను డిఎంకె తో సుదీర్ఘ మంతనాలు జరిపాము.

కూటమి విజయానికి పార్టీలు అవసరం అని ఒక వైపున అంగీకరిస్తూనే, కూటమిలోని పార్టీలకు తక్కువ సీట్లు కేటాయించడానికి డిఎంకె ప్రయత్నించింది. తన స్వంత గుర్తు మీదనే అత్యధిక స్థానాలకు పోటీచేసి తనొక్కటిగానే మరిన్ని అధిక స్థానాలు గెలుపొందాలని భావించింది.

కాంగ్రెస్‌కు తప్ప మిగతా అన్ని భాగస్వామ్య పార్టీలకు మూడేసి స్థానాల చొప్పున మాత్రమే కేటాయించడానికి పూనుకొన్న డిఎంకెతో సుదీర్ఘ సంభాషణలు, మంతనాలు జరపడంతో సిపిఎం, సిపిఐ, విసికెలకు 6 స్థానాల చొప్పున కేటాయించింది. ఈ 6 స్థానాలు మన ప్రభావానికి, ప్రతిష్టకు సరితూగవని పార్టీ అసంతృప్తి చెందినప్పటికీ, అన్నాడిఎంకె, బిజెపి కూటమిని ఓడించాలన్న పెద్ద అవసరం దృష్ట్యా అంగీకరించడం జరిగింది. ఈ 6 సీట్ల ఎంపిక సైతం మనకు సంతృప్తి కలిగించలేదు. మనం 8 సీట్లు షార్ట్‌లిస్ట్ చేస్తే, వాటిలో 3 మాత్రమే కేటాయించబడ్డాయి, కన్యాకుమారి, చైన్నై జిల్లాలో మనకు సీటు ఇవ్వలేదు. ఈ జిల్లాల్లో పోటీ చేసినట్లయితే మన విజయం స్థాయి మెరుగ్గా ఉండేది.

దిండిగల్, కోవిల్‌పట్టి, కిల్వేలూర్, కందర్వకొట్టై, హోరూరు, తిరుపురనకుంద్రరా ఈ స్థానాలలో పార్టీ పోటీ చేసింది.

ఈ 6 నియోజక వర్గాలలో కందర్వకొట్టై, కిల్వేలూర్ స్థానాలలో మాత్రమే మనం గెలుపొందగలిగాము. మిగతా నాలుగు స్థానాలను గణనీయమైన మార్జిన్‌తో

మనం కోల్పోయాము. మనం షార్ట్ లిస్ట్ చేసిన స్థానాలలో, మనకు కేటాయించిన మూడు స్థానాలలో రెండింటిలో– దిండిగల్, కోవిల్‌పట్టిల్లో మనం విజయం సాధించలేకపోయాము.

**కిల్వేలూర్:** మనకు సాంప్రదాయకంగా బలం ఉండటం, పార్టీ బలము, గతంలో మనం చేసిన మంచి పనులు ఈ నియోజకవర్గంలో విజయం సాధించడానికి కారణాలు. డెల్టా ప్రాంతంలోను, కేంద్ర జిల్లాలలోను డిఎంకె కూటమి మరింత ప్రజాదరణతో విజయం సాధించడం మన గెలుపును ధృవపరిచింది. అన్నా డిఎంకె కూటమి తరపున పిఎంకె అభ్యర్థి నిలబడటం కూడ మనం అదనపు మార్జిన్‌తో గెలుపొందడానికి దోహదం చేసింది.

**కందర్వకొట్టై:** డిఎంకె కూటమి డెల్టా ప్రాంతంలోను, కేంద్ర జిల్లాలలోను అదనపు ప్రజాదరణతో గెలుపొందడం మన విజయంలో బలమైన అంశం. గతంలో ఇక్కడ మనం గణనీయంగా స్థానిక సంస్థల్లో గెలుపొందాము. మన ప్రజాప్రతినిధులు చేసిన మంచి కృషి ఈ విజయానికి సహాయకారిగా ఉపయోగపడింది. ఎఎంఎంకె అభ్యర్థి ఎక్కువ ఓట్లు సాధించడం కూడ మనకు దోహదపడింది.

సిపిఐ కూడ పోటీ చేసిన 6 స్థానాలలో రెండింటిని గెలిచింది. అయితే విసికె పోటీ చేసిన 6 స్థానాలలో 4 స్థానాలలో విజయం సాధించింది.

దిండిగల్, కోవిల్‌పట్టి, తిరుపరన్‌కుంద్రం, హోరూర్ నియోజక వర్గాలలో మన పరాజయానికి కారణాలేమిటన్న విషయాన్ని ఆ జిల్లా కమిటీలు మరింత లోతుగా సమీక్షిస్తున్నాయి. దిండిగల్‌లో మనం గతంలో ఐదుసార్లు గెలుపొందాము, ఈ సారి 17000 ఓట్ల తేడాతో ఓడిపోయాము. హోరూర్ నియోజకవర్గంలో మనం గతంలో నాలుగు సార్లు గెలుపొందాము. కోవిల్‌పట్టిలో నియోజకవర్గ డీలిమిటేషన్ మనపై ప్రతికూల ప్రభావం చూపింది. దినకరన్ తన ధనబలంతో పోటీ లోకి దిగడం కూడ మన ఓటమికి దారితీసిన కారణాల్లో ఒకటి.

**పుదుచ్చేరి:** ఎన్నికలు సమీపిస్తున్నపుడు కాంగ్రెస్ నుండి, డిఎంకె నుండి కొందరు ఎమ్మెల్యేలు బిజెపిలోకి ఫిరాయించారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి నారాయణ స్వామి రాజీనామా చేయడంతో, ఎన్నికలు గవర్నరు పాలనలో జరిగాయి. సంబంధాలు చెడినప్పటికీ కాంగ్రెస్, డిఎంకెలు కూటమిగా పోటీ చేశాయి. కాంగ్రెస్ 15, డిఎంకె 13, సిపిఐ, విసికె 1 చొప్పున సీట్ల సర్దుబాటు జరిగింది. మనకు ఒక్క సీటు కూడ కేటాయించలేదు. ఈ పరిస్థితిలో మనం ముత్యాల్‌పేట్ నియోజకవర్గంలో పోటీ చేయాలని, మిగిలిన స్థానాలలో కాంగ్రెస్, డిఎంకె కూటమికి ఓటు చేయాలని

నిర్ణయించాము. ఈ అవగాహనతో మనం ముత్యాల్‌పేట్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం, బహిరంగ సభలు నిర్వహించాము. అయితే, మనకు కేవలం 320 ఓట్లు మాత్రమే లభించాయి.

కేరళ సరిహద్దుల లోపల ఉన్న మాహె నియోజకవర్గంలో ఎల్‌డిఎఫ్ స్వతంత్ర అభ్యర్థిని నిలబెట్టడం ఆనవాయితీ. 2016 ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ స్వతంత్ర అభ్యర్థి 10,707 ఓట్లు సంపాదించి విజయం సాధించాడు. ఈ సారి 9444 ఓట్లు సంపాదించి, 300 ఓట్ల తేడాతో ఓడిపోయాడు. కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించాడు.

కాంగ్రెస్, డిఎంకెలు పొత్తు పెట్టుకున్నప్పటికీ ఆ రెండు పార్టీలు భుజం భుజం కలిపి పనిచేయలేదు. అందుచేత ఎన్‌ఆర్ కాంగ్రెస్, బిజెపి కూటమిని ఓడించాలన్న ఎన్నికల లక్ష్యం నెరవేరలేదు. ఈ పరిస్థితిలో 15 స్థానాలకు పోటీచేసిన కాంగ్రెస్ 2 స్థానాలను మాత్రమే గెలుచుకుంది, 13 స్థానాలకు పోటీ చేసిన డిఎంకె 6 స్థానాలు గెలుచుకుంది.

2016 నుండి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇక్కడ ఎన్నికైన కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రభుత్వాన్ని అస్థిరత్వం పాల్జేయాలని ప్రయత్నిస్తున్నది. దీనికోసం లెఫ్టినెంట్ గవర్నర్ అధికారాలను బరితెగించి దుర్వినియోగపరుస్తున్నది. లెఫ్టినెంట్ గవర్నర్ సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతూ, ఎన్నికైన ప్రభుత్వాన్ని నడవకుండా చేశాడు.

పుదుచ్చేరిలో లెఫ్టినెంట్ గవర్నరుకు ముగ్గురు ఎంఎల్‌ఏలను నియమించే అధికారం ఉంది. వారికి న్యాయవ్యవస్థ ఓటింగ్ హక్కు కల్పించింది. 2016లోను, 2021లోను లెఫ్టినెంట్ గవర్నర్ ఈ మూడు స్థానాలకు బిజెపి వారిని నియమించాడు. నామినేటెడ్ సభ్యులను పాలకపార్టీ సిఫార్సుచేసిన స్వతంత్ర వ్యక్తుల నుండి నియమించే సంప్రదాయాన్ని అనుసరించలేదు. 2016లో బిజెపి ఒక్క స్థానంలో కూడ గెలుపొందలేదు, అయినా నామినేటెడ్ ముగ్గురు ఆ పార్టీకి ఉన్నారు. ఇప్పుడు కూడ బిజెపి 6 స్థానాలలో గెలుపొందినప్పటికీ, మరో ముగ్గురు ఆ పార్టీనుండి నామినేట్ చేయబడ్డారు. దీనితో ఆ పార్టీ బలం 9 కి పెరిగింది. ఎన్‌ఆర్ కాంగ్రెస్ 10 స్థానాలు గెలుచుకుంది. ఎన్‌ఆర్ కాంగ్రెస్, బిజెపిల ప్రభుత్వం ఏర్పడింది.

ఈ సారి పుదుచ్చేరిలో 6 గురు స్వతంత్రులు ఎన్నికయ్యారు. పెనుగులాడి, వారితో బేరసారాలాడి ఎన్‌ఆర్ కాంగ్రెస్, బిజెపిల ప్రభుత్వం ఏర్పడింది.

**బలహీనతలను అధిగమించాలి:** పార్టీ ఓటింగ్ శాతం చాల కాలంగా

తక్కువగా ఉంటున్నది. ఈ ఎన్నికల్లో సిపియం, సిపిఐ, విసికె లు ఆరు స్థానాలు చొప్పున పోటీ చేశాయి. మనకు వచ్చిన ఓటింగ్ శాతం 0.85. సిపిఐ కి వచ్చిన 1.09 శాతం కన్నా ఇది తక్కువ. విసికె కు 1.5 శాతం ఓట్లు లభించాయి. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో మన పార్టీ ఆరు పార్టీల ప్రజాసంక్షేమ ఫ్రంట్‌లో భాగంగా 25 స్థానాలకు పోటీ చేసింది. కాని మనకు వచ్చిన ఓటింగ్ శాతం మిగతా ఐదు పార్టీల కన్నా తక్కువగా ఉంది. మనకు 0.71 శాతం ఓట్లు వస్తే, సిపిఐకి 0.79 శాతం ఓట్లు వచ్చాయి. ఆరు పార్టీలు కలిసి 6.1 శాతం ఓట్లు తెచ్చుకున్నాయి. రాష్ట్ర కమిటీ సమీక్ష ఇలా పేర్కొంది: "మనం చాల సార్లు పోటీ చేసిన నియోజకవర్గాల్లో సైతం మన ఓటింగ్ శాతం పెరగడం లేదు. ఈ బలహీనతను సరిగా విశ్లేషించి, అధిగమించాలి. ఈ స్థానాల్లో మన స్వతంత్ర బలం, ప్రజాపునాది పెరగక పోతే భవిష్యత్తులో మనం విజయం సాధించలేం." దీన్ని తీవ్రంగా పరిశీలించి, అవసరమైన రాజకీయ, నిర్మాణ చర్యలను చేపట్టాలి.

రాష్ట్ర కమిటీ సమీక్ష పేర్కొన్న బలహీనతలూ ప్రాధాన్యతా నియోజకవర్గాలను ఎంచుకోవడం, అభ్యర్థుల ఎంపికపై పార్లమెంటరీ అవకాశవాదం ప్రభావం చూపడం, యువత, మహిళలు, కార్మికవర్గ సెక్షన్లు నుండి అభ్యర్థులను ఎంపిక చేయాలన్న విధానాన్ని సరియైన పద్ధతిలో అనుసరించక పోవడం, మనం ప్రాధాన్యతా నియోజకవర్గాలుగా గుర్తించిన వాటిలో సైతం అభ్యర్థుల తుది జాబితా ప్రకటించేంతవరకు ప్రజలను కలుసుకోకపోవడం, వోటర్ల జాబితాలను పరిశీలించడం, కొత్త ఓటర్లను చేర్పించడం, పోలింగ్ బూత్ ఏజంట్లను సన్నద్ధం చేయడం లాంటి ఎన్నికల సన్నాహక చర్యలలో లోపాలూ వీటన్నింటిని సరిచేసుకోవాలి. అవసరమైన నిర్మాణపరమైన చర్యలను చేపట్టాలి.

ఎన్నికల్లో పార్టీ కమిటీల, శాఖల, పార్టీ సభ్యుల పనితీరు గురించి సరైన సమీక్ష నిర్వహించాలి. పార్టీ శాఖలు క్రమబద్ధంగా సమావేశం కావడం, స్థానిక సమస్యలను చేపట్టడం, మన శ్రేణులను రాజకీయంగా చైతన్యవంతులను చేయడం, ప్రజల్ని ప్రభావితం చేసే మన శక్తిని పెంచుకోవడం– వీటిపై కృషి తక్షణం జరగాలి.

## అస్సాం

బిజెపి కూటమి వరుసగా రెండవసారి అధికారాన్ని సంపాదించింది. ఈ కూటమికి 125 స్థానాలకు కాను 75 స్థానాలు లభించాయి.

1,91,76,846 ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్రంలో

మొత్తం 2,33,74,087 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్‌లో పాల్గన్న వారు 82.4 శాతం. ఇది 2016 అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్‌లో పాల్గన్న వారి కన్నా 2.13 శాతం తక్కువ. ఈ ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ వైపుకూ ఒక వెల్లువంటూ లేదు.

ప్రధాన పోటీ బిజెపి నాయకత్వంలోని కూటమికి, కాంగ్రెస్ నాయకత్వంలోని కూటమి 'మహాజోత్' కు మధ్య జరిగింది. బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బిపిఎఫ్) 2016 ఎన్నికల్లో బిజెపితో ఉన్నది. బిపిఎఫ్ కు బదులు బిజెపితో ఇప్పుడు కొత్తగా ఏర్పడిన యుపిపిఎల్ ఉంది. బిజెపి నాయకత్వంలోని కూటమి 75 స్థానాలు గెలుచుకుంది. 2016 ఫలితాలతో పోల్చుకున్నపుడు బిజెపి, దాని మిత్రులు ఇప్పుడు 11 స్థానాలు కోల్పోయారు. బిజెపికి 60 స్థానాలు (33.21 శాతం), ఎజిపికి 9 స్థానాలు (7.9 శాతం), యుపిపిఎల్‌కు 6 స్థానాలు (3.4 శాతం) లభించాయి.

కాంగ్రెస్‌కు 29 స్థానాలు (29.67 శాతం), ఎఐయుడిఎఫ్‌కు 16 స్థానాలు (9.29 శాతం), బిపిఎఫ్‌కు 4 స్థానాలు (3.39 శాతం) లభించాయి. మహాజోత్ లోని ఇతర పార్టీలు సిపిఐ (0.14 శాతం), సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ (0.14 శాతం), అంచలిక్ గణ మోర్చా (0.07 శాతం), ఆర్‌జెడి ఒక్క స్థానంలో కూడ విజయం సాధించలేదు. మహాజోత్ తో సీట్ల సర్దుబాటు చేసుకొని సిపిఐ(ఎం) రెండు స్థానాలకు పోటీ చేసింది. సోర్భాగ్ స్థానంలో విజయం సాధించింది. మన పార్టీకి 0.84 శాతం ఓట్లు లభించాయి.

బిజెపి కూటమికి 44.32 శాతం ఓట్లు లభించాయి. మహా జోత్ కూటమికి 43.54 శాతం ఓట్లు లభించాయి. రెండు కూటముల మధ్య ఓటింగ్ శాతం తేడా కేవలం 0.78 శాతం మాత్రమే. బిజెపి కూటమికి 85,56, 059 ఓట్లు లభించగా, మహాజోత్ కూటమికి, సిపిఐ(ఎం) కు కలిపి 83,96,486 ఓట్లు లభించాయి. రెండు కూటముల మధ్య ఓట్ల తేడా 1,59,673 మాత్రమే.

**నేపథ్యం:** రాష్ట్రంలో బిజెపి మొదటిగా 2016 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చింది. ఆనాటి ఎన్నికల్లో బిజెపి ఎన్నో వాగ్దానాలు చేసింది. అస్సాం జాతి, మాటి, వేటి (జాతి, భూమి) లను రక్షిస్తామని వాగ్దానం చేసింది. కాని బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వం గత ఐదేండ్లుగా నిరంతరం ప్రజావ్యతిరేక ఆర్థిక విధానాలను అనుసరించింది, రాజకీయంగా మత పరమైన విభజన విధానాన్ని అనుసరించింది, ప్రజాస్వామ్యంపై దాడులను అధికం చేసింది. ఇది ప్రజల బాధలను పెంచింది. మొట్టమొదటి నుండి బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వం దాదాపు ప్రతి ముఖ్యమైన అంశం మీద మత రాజకీయాలకు, ప్రచారానికి పాల్పడుతూ, రాష్ట్రంలో శాంతి, సమైక్యత, సమగ్రతలను

ప్రమాదంలో పడవేసింది.

ఇలాంటి పరిస్థితిలో 2021 ఎన్నికల్లో బిజెపిని మళ్ళీ అధికారంలోకి రాకుండా చేయడం, సెక్యులర్ ప్రభుత్వానికి మార్గం సుగమం చేయడం ప్రధాన కర్తవ్యంగా ముందుకొచ్చింది. అయితే ఈ బాధ్యతను నెరవేర్చేందుకు ఏ ఒక్క పార్టీ బలం కూడ సరిపోదు. బిజెపిని, దాని మిత్రులను ఓడించాలంటే ఒక ఉమ్మడి ఫ్రంట్‌గా ఏర్పడటం వామపక్ష, ప్రజాతంత్ర శక్తులకు అనివార్యం అయింది. ఎఐయుడిఎఫ్, బిపిఎఫ్, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్, అంచలిక్ గణ మోర్చాలు కాంగ్రెస్ నాయకత్వాన 'మహా జోత్' గా ఏర్పడ్డాయి. తర్వాత ఆరెజెడి కూడ కలిసింది. పార్టీ రాష్ట్ర కమిటీలో చర్చలకు ప్రాతిపదికగా ఎన్నికల ఎత్తుగడలను మనం రూపొందించున్నాం.

**బిజెపి విజయానికి కారణాలు:** 1, బిజెపి తిరిగి అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం తీవ్రమైన మత విభజన. గత పాలనా కాలంలో బిజెపి తన పచ్చి మతతత్వ రాజకీయాలను విజయవంతంగా ముందుకు తీసుకు వెళ్ళింది. హిందువులు నివసించే ప్రాంతాలలో ఆరెస్సెస్, బిజెపి నిర్మాణాన్ని బలోపేతం చేయడంలో విజయవంతమయింది. పౌరసత్వ బిల్లు వ్యతిరేక ఉద్యమ సమయంలో బిజెపి, ఆరెస్సెస్ మతతత్వ రాజకీయాలకు కొన్ని అవరోధాలు ఎదురయ్యాయి. కాని కోవిడ్ మొదటి వేవ్ కారణంగా పౌరసత్వ బిల్లు వ్యతిరేక ఉద్యమం బలహీనపడింది. మహమ్మారి పరిస్థితిని బిజెపి సంపూర్ణంగా వినియోగించుకుంది. కోవిడ్ వ్యాప్తిపై పోరాటం పేరుతో ప్రజాతంత్ర విలువలన్నింటిని తుంగలో తొక్కింది, ఉద్యమాలను, ఆందోళనలను అణచివేయడానికి పూనుకొంది. కోవిడ్ తొలిదశలో బిజెపి, ఆరెస్సెస్‌లు ముస్లిములే కోవిడ్ వ్యాప్తికి ఏకైక కుట్రదారులంటూముస్లిం వ్యతిరేక మతతత్వ ప్రచారాన్ని పెద్ద ఎత్తున సాగించింది. ఎన్నికల ప్రచార సమయంలో సైతం బిజెపి, ఆరెస్సెస్‌లు ఈ ఎన్నికలు 'నాగరికతల మధ్య యుద్ధం', 'మొగలులకు వ్యతరేకంగా పోరాటం', '65 శాతానికి, 35 శాతానికి మధ్య జరుగుతున్న పోరాటం' లాంటి నినాదాలతో ప్రచారం చేసింది. ఈ ప్రచారంతో ఈ మతసంస్థలు ప్రజల్ని మతాల వారీగా విడగొట్టాయి. ఇలాంటి పచ్చి మతతత్వ నినాదాలు, ప్రజల్ని ప్రత్యేకించి మైనారిటీ మతస్తులు గణనీయంగా ఉన్న నియోజక వర్గాలలో మతాల వారీగా విడగొట్టడంలో విజయవంతమయ్యాయి.

2, గత ఐదేళ్ళ కాలంలో ఆరెస్సెస్, సంఘ పరివార్ నాయకత్వంలోని సంస్థలు రాష్ట్రంలో తమ కార్యకలాపాలను ఒక పథకం ప్రకారం విస్తరింపచేశాయి. వాటి కార్యకలాపాలతో అవి ప్రజల్ని మతాల వారీగా సమీకరించి మతతత్వ విషాన్ని

వ్యాపింపచేశాయి.

3, ఎన్నికలకు కొద్ది సమయం ముందు పాలక పార్టీ 'కిసాన్ సమ్మాన్ నిధి', 'అరుణోదయ', 'జన్, ధన్ యోజన', 'విద్యార్థినులకు ఉచితంగా స్కూటీల పంపిణీ', 'తేయాకు తోటల కార్మికులకు రు.3000 నగదు' లాంటి పథకాలతో ఒక పెద్ద లబ్ధిదారుల పునాదిని ఏర్పరుచుకుంది. వివిధ పథకాల ద్వారా బిజెపి గ్రామీణ పేదల్లోను, తేయాకు తోటల్లోను మంచి పలుకుబడి సంపాదించింది. అదే విధంగా మైక్రో ఫైనాన్స్ రుణాల రద్దు లాంటి నినాదం ద్వారా మహిళలను పెద్ద ఎత్తున తనవైపుకు రాబట్టుకుంది. ఆలయాలకు, నామ్‌గార్లకు, సత్రాలకు ప్రభుత్వ ధనాన్ని బిజెపి పంపిణీ చేయడం కూడ దాని పలుకుబడి పెరగడానికి దోహదపడింది.

4, ప్రజల్ని మతాల వారీగా విభజించడానికి బిజెపి తన ప్రయత్నాన్ని నిరంతరం కొనసాగించడం ద్వారా, ప్రజలు తమ జీవితాలకు, జీవన భృతికి సంబంధించిన సమస్యలవైపుకు దృష్టి మళ్ళించకుండా చేయడంలో విజయవంతమయింది. హిందూ మతానికి చెందిన తెగలు, ఉపజాతుల ఓట్లలోఅత్యధికం బిజెపికే పడ్డాయి. ఈ ధోరణి భాషాపరమైన మైనారిటీలలో మరీ ఎక్కువగా ఉంది.

5, ధనబలాన్ని విపరీతంగా వినియోగించడం, ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడం బిజెపి ఎన్నికల ప్రచారంలో ప్రధానాంశంగా ఉంది. ఎన్నికల కమిషన్ పాత్ర కూడ పూర్తి పక్షపాతంతో పాలక పార్టీకి ఉపయోగపడేలా ఉంది.

6, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలు రెండూ అత్యధికం బిజెపికి అనుకూలంగా ప్రచారం చేశాయి.

7, అసెంబ్లీ ఎన్నికలకు సన్నాహాన్ని బిజెపి చాల ముందుగా ఆరంబించింది. ఏడాది ముందుగానే బూత్ కమిటీలను ఏర్పాటు చేసి వాటి కార్యకలాపాలను పెంచింది. ఎన్నికలకు కొద్ది సమయం ముందు బిజెపి ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల సమావేశాలను నిర్వహించింది. ఓటర్లను ఆకట్టుకోవడానికి ప్రభుత్వం ఎన్నో పనాది రాళ్లు వేసింది.

**మహా జోత్ ఓటమికి కారణాలు:** 1, బిజెపి వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు అన్నీ ఐక్యం కావడం సంపూర్ణంగా జరగలేదు, సంతృప్తికరంగా జరగలేదు. కొత్తగా ఏర్పడిన రెండు బిజెపి వ్యతిరేక పార్టీలు ఎజెపి, ఆర్‌డి లు ఎన్నికల్లో విడిగా పోటీ చేశాయి. ఫలితంగా బిజెపి వ్యతిరేక ఓట్లు చీలిపోయాయి. అదే సమయంలో ఈ పరిణామం చాల మంది వామపక్ష, లౌకిక

ప్రజల మనోస్థైర్యాన్ని దెబ్బతీసింది.ఎన్నికలు రెండు మాసాలు ఉన్నాయన్నప్పుడు సైతం, బిజెపి వ్యతిరేక శక్తులు సమైక్య ప్రతిఘటన ఇస్తాయా లేదా అన్న సందేహం నెలకొని ఉంది. ఇది ప్రజలపై ప్రతికూల ప్రభావాన్ని చూపింది.

2, బిజెపి వ్యతిరేక పార్టీలను ఏకం చేయడం అన్న విషయం వరకు కాంగ్రెస్ పార్టీ పాత్ర శ్లాఘనీయంగా ఉంది. అయితే, కాంగ్రెస్ నాయకత్వంలో అంతర్గత విభేదాలు, నాయకత్వంలో ఒక సెక్షను హిందూత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా బలంగా నిలబడక పోవడం, మహా జోత్ లోని ఇతర పార్టీలకు తగినంత ప్రాదాన్యత ఇవ్వక పోవడం- ఇవన్నీ బిజెపి వ్యతిరేక కూటమిలో నాయకత్వ పార్టీగా కాంగ్రెస్ వ్యవహరించడంలో వైఫల్యానికి దారితీశాయి. ఐదేళ్ళ కాలంగా కోల్పోయిన ప్రతిష్టను కాంగ్రెస్ తిరిగి సంపాదించుకోలేక పోయింది.

3, అభివృద్ధిపై బిజెపి తప్పుడు ప్రచారాన్ని మహా జోత్ పార్టీలు సంపూర్ణంగా సవాలు చేయలేకపోయాయి. దీనితో సాధారణ ఓటర్లు బిజెపి ప్రచారానికి లోనయ్యారు. బిజెపి పాలనలో రాష్ట్రం అభివృద్ధి మార్గం పట్టిందని, ఇక ముందు కూడ అలాగే ముందుకు సాగుతుందని భావించారు.

4, బోడోల్యాండ్ ప్రాంతీయ మండలికి జరిగిన గత ఎన్నికల్లో బిపిఎఫ్ నుండి యుపిపిఎల్ అధికారాన్ని లాక్కుంది. ఫలితంగా మహాజోత్ లో భాగస్వామిగా ఉన్న బిపిఎఫ్ బలాన్ని, ప్రభావాన్ని ఈ సారి గణనీయంగా కోల్పోయింది. అందుచేత, బిపిఎఫ్ కేవలం నాలుగు స్థానాలు మాత్రమే గెలుచుకోగలిగింది. 2016లో బిపిఎఫ్ 12 స్థానాల్లో గెలుపొందింది.

5, 2016 ఎన్నికల్లో కాంగ్రెస్, ఎఐయుడిఎఫ్ ల మధ్య ఓట్లు చీలిపోయిన ఫలితంగా బిజెపి 12 స్థానాలలో విజయం సాధించింది. ఈ సారి సర్దుబాట్లు జరిగిన తర్వాత కూడ వాటిలో 6 స్థానాలను బిజెపి గెలుచుకుంది. మహాజోత్ కూటమిలోని పార్టీల మధ్య ఓట్ల బదలాయింపులో బలహీనతను ఇది వ్యక్తం చేస్తున్నది. మరో వైపున మత ప్రాతిపదికన విభజన పటిష్టమయింది.

6, ఐదు ఎగువ అస్సాం జిల్లాలలో ప్రతిపక్ష ఓట్లలో చీలిక మూలంగా బిజెపి 10 స్థానాలలో గెలవగలిగింది. బిజెపి వ్యతిరేక ఓట్లలో కొంత భాగం ఎజెపి తో పోయింది. కొన్ని పాకెట్లలో ఆర్‌డి కూడ చెడగొట్టే పాత్రను పోషించింది. అంతేకాదు, ఎన్నికల ప్రచారంలో ఎఐయుడిఎఫ్ బాధ్యతా రహితంగా కొన్ని మతపరమైన వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యాఖ్యలు బిజెపి మతపరంగా ఓటర్లను మరింతగా చీల్చడానికి దోహదపడ్డాయి.

**సిపిఐ(ఎం), వామపక్షాలు:** సిపిఐ(ఎం) 2 స్థానాలలో పోటీ చేసింది. సిపిఐ, సిపిఐ (ఎంఎల్) లు ఒక్కో స్థానం చొప్పున పోటీ చేశాయి. కార్బీ యాంగ్లాంగ్ కొండ ప్రాంత జిల్లాలో సిపిఐ(ఎంఎల్) విడిగా 3 స్థానాల్లో పోటీ చేసింది. సో ర్భా గ్ నియోజక వర్గంలో మన పార్టీ బిజెపిని 10,662 ఓట్ల తేడాతో ఓడించింది. సిపిఐ(ఎం) అభ్యర్థి మనోరంజన్ టాకూర్దార్ 96,134 ఓట్లు సంపాదించి బిజెపి నుండి ఆ స్థానాన్ని కౌవసం చేసుకున్నాడు. బిజెపికి 85,472 ఓట్లు లభించాయి. సిపిఐ(ఎం)కు 50.2 శాతం ఓట్లు రాగా, బిజెపికి 45.2 శాతం ఓట్లు లబించాయి.

రంగియా నియోజక వర్గంలో మన పార్టీ అభ్యర్థికి 64,426 ఓట్లు లభించాయి. బిజెపి అభ్యర్థికి 84,844 ఓట్లు లభించాయి. 20,220 ఓట్ల మెజారిటీతో బిజెపి విజయం సాధించింది. సిపిఐ(ఎం) రెండవ స్థానంలో నిలిచింది. రంగియాలో ఎజెపికి 3,560 ఓట్లు, ఆర్‌డికి 3,505 ఓట్లు లభించాయి. 4 స్థానాల్లో పోటీ చేసిన సిపిఐ, సిపిఐ(ఎంఎల్) లు ఒక్క స్థానంలో కూడ గెలుపొందలేదు. సిపిఐకి 27,290 ఓట్లు, సిపిఐ(ఎంఎల్)కు 21,531 ఓట్లు లభించాయి.

పార్టీ నిర్ణయించినట్టుగా అన్ని జిల్లా కమిటీలు పార్టీ అభ్యర్థులకు, మహాజోత్ అభ్యర్థులకు స్వతంత్రంగా ప్రచారం చేయాలని రాష్ట్ర కమిటీ ఆదేశించింది. కోవిడ్ మూలంగా జిల్లా కమిటీలు ఇంకా తమ తమ నివేదికలను అందించలేదు. చాల జిల్లా కమిటీలు మహమ్మారి మూలంగా ఇంకా సమావేశాలను జరపలేదు. రాష్ట్ర కేంద్రానికి వచ్చిన సమాచారాన్ని బట్టి దాదాపు అన్ని జిల్లా కమిటీలు పార్టీ నిర్ణయానికి అనుగుణంగానే ప్రచారాన్ని నిర్వహించాయి. పార్టీ ఎన్నికల ఎత్తుగడలను ఎక్కడా ఉల్లంఘించినట్లు ఇప్పటివరకు సమాచారం ఏమీ లేదు.

గత పదేళ్ళుగా మన పార్టీకి అసెంబ్లీలో ప్రాతినిధ్యం లేదు. మన పార్టీకి ప్రాతినిధ్యాన్ని సంపాదించాలని, లౌకిక ప్రభుత్వ ఏర్పడాలని మనం ఎన్నికల ఎత్తుగడలను రూపొందించుకున్నాం. బిజెపి వ్యతిరేక ఓట్లు చీలిపోకూడదన్న ఉద్దేశంతో మన పార్టీ మహాజోత్ తో చేతులు కలిపింది. పరిమితమైన స్థానాలకు మాత్రమే పోటీ చేయాలని నిర్ణయించింది. 9 నియోజక వర్గాల్లో పోటీ చేయాలని పార్టీ రాష్ట్ర కమిటీ తొలుత ప్రతిపాదించింది. అనేక జిల్లాలు సీట్ల సర్దుబాటు ఎజెండాలోకి వచ్చేవరకు తగిన సన్నాహంతో లేవు. చివరికి, షార్ట్ లిస్ట్ చేసిన స్థానాల్లో నాల్గింటిని పార్టీ వదిలివేసింది. అంతిమంగా, సోర్భాగ్, రంగియా స్థానాల విషయంలో ఎట్టిపరిస్థితిలోను రాజీపడేది లేదని పార్టీ నిర్ణయానికొచ్చింది. సీట్ల సర్దుబాట్లలో లోపాల మూలంగా ప్రతిపక్ష ఐక్యతను బిజెపిని దెబ్బతీయరాదన్న జాగ్రత్త తీసుకోబడింది.

## ముగింపు నిర్ధారణ

మొదట్లోనే చెప్పినట్లు ఈ ఫలితాలు తక్షణ సమస్యలపై ప్రజా ఉద్యమాలు, పోరాటాలను మరింత బలోపేతం చేయడానికి అవకాశం కల్గిస్తాయి. మన స్వతంత్ర ప్రజా పునాదిని బలోపేతం చేయడానికి పార్టీ చురుగ్గా కదలాలి. రాబోయే కాలంలో కోవిడ్ నిబంధనలను, ఆంక్షలను పాటిస్తూనే ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తూ శ్రమ జీవులతో అనుసంధానాన్ని పటిష్టపరుచుకోవాలి.

కోవిడ్‌ను ఎదుర్కోవడంలో వైఫల్యం, హిందూత్వ అజెండాతో మతపరమైన విభజన, రాఫేల్ కుంభకోణం, పెగసస్ స్పైవేర్ గూఢచర్యం, జాతీయ ఆస్తులను పెద్ద ఎత్తున ప్రైవేటీకరించడం, లూటీ చేయడం, అంతులేని ధరల పెరుగుదల, ప్రజల జీవనభృతిపై పెరుగుతున్న దాడి, తగిన ఉపశమనం కల్పించడానికి నిరాకరణ– ఇవి ప్రజా పోరాటాలను, జోక్యాన్ని బలోపేతం చేయాల్సిన కొన్ని సమస్యలు. వామపక్షాలతో కలిసి ఉమ్మడి కార్యాచరణ చేస్తూనే, ఉమ్మడి కార్యాచరణలో, పోరాటాలలో కలవడానికి సిద్ధపడే లౌకిక పార్టీలను కూడ సమీకరించాలి.

* * *

ప్రతులు : 3000 ప్రచురణ కాలం : ఆగస్టు, 2021 వెల : ₹. 10/-
(పార్టీ శాఖలకు మాత్రమే)

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ
27-13-3, సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం, ఆకుల వారి వీధి,
గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ నెం. 0866 2577202, 9490099057